
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శుక్రవారం 9 ఫిబ్రవరి 2024





తెనాలి: కొలకలూరులో జరిగిన రచ్చబండలో ప్రసంగిస్తున్న షర్మిల

కష్టాల్లో తోడుంటాం

- బాధిత కుటుంబాలకు అండగా పార్టీ
- మృతుల కుటుంబీకులకు ఆర్థిక సహాయం
- తాడికొండ నియోజకవర్గంలో భువనేశ్వరి నిజం గెలవాలి యాత్ర


ఫిరంగిపురం: రేగులగడ్డ గ్రామంలో రూ.3లక్షల చెక్కును అందిస్తున్న భువనేశ్వరి


తాడికొండ: బండారుపల్లిలో బాలయ్య కుటుంబసభ్యులను ఓదార్చుతూ..


తుళ్లూరు: రాయపూడిలో మృతుని కుటుంబసభ్యులకు రూ.3లక్షల చెక్కును అందించి పరామర్శిస్తూ..

తాడికొండ, ఫిరంగిపురం, తుళ్లూరు, ఫిబ్రవరి 8: కార్యకర్తలు, నాయకుల కుటుంబాలు కష్టాల్లో ఉంటే వారికి ఎల్లప్పుడు పార్టీ తోడుగా ఉంటుంది. అధైర్య పడ వద్దు. అండగా ఉంటాం.. అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా గురువారం ఆమె తాడికొండ నియోజకవర్గంలో పర్యటించారు. గతంలో చంద్రబాబు అరెస్టుతో మనస్థాపంతో మృతి చెందిన వారి కుటుంబాలను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పి పార్టీ తరపున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వారి నివాసాలకు వెళ్లిన భువనేశ్వరి వారి చిత్ర పటాల వద్ద నివాళులు అర్పించారు. ఉండవల్లి నుంచి రోడ్డు మార్గంలో ఆమె తాడికొండ, ఫిరంగిపురం, తుళ్లూరు మండలాల్లో పర్యటించారు. తాడికొండ మండలం బండారుపల్లిలో తూమాటి బాలయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఫిరంగిపురం మండలం కండ్రిక శివారు రేగులగడ్డకు చెందిన నల్లజర్ల పెదచెన్నకేశవరావు కుటుంబాన్ని పరామర్శించి ఆయన భార్య లక్ష్మి, కుమారుడు పెదబంగారయ్య, కుమార్తె బాలనరసమ్మలకు రూ.3 లక్షల చెక్కు అందజేశారు. తుళ్లూరుకు చెందిన మోరం సాంబశివరావు, రాయపూడికి చెందిన గోరగంటి మల్లికార్జునరావు, వెంకటపాలేనికి చెందిన లంకా నరసింహారావు కుటుంబాలను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు.

ఘన స్వాగతాలు.. ఆప్యాయంగా పలకరింపులు

నిజం గెలవాలి యాత్రలో భాగంగా పర్యటిస్తున్న భువనేశ్వరికి దారిపొడవునా మహిళల నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. ఆయా గ్రామాల్లో భువనేశ్వరని చూసేందుకు మహిళలు పూలు చల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తుళ్లూరు వెళ్లే క్రమంలో గరికపాడులో మహిళలు, వృద్ధులను ఆమె పలకరించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. గరికపాడు నుంచి వస్తున్న క్రమంలో పనుల్లో నిమగ్నమైన మహిళా కూలీలు భువనేశ్వరి రాకను గమనించి ఆమెను చూసేందుకు పరుగులు తీశారు. పొలాల్లో నుంచి వస్తున్న వారిని గమనించిన భువనేశ్వరి కారును ఆపి వారితో కొద్దిసేపు గడిపారు. పొన్నెకల్లులో మహిళలు భువనేశ్వరికి హారతులతో స్వాగతం పలికారు. తాడికొండ అడ్డరోడ్డు వద్ద నిడుముక్కల, మోతడక గ్రామానికి చెందిన మహిళలు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. తాడికొండలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద, అమరావతి దీక్షా శిబిరం వద్ద మహిళలు, రైతులు, భువనేశ్వరికి పూలతో స్వాగతం పలికారు. ఫిరంగిపురం మండలం కండ్రిక శివారు రేగులగడ్డలో షిరిడీసాయి ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. తుళ్లూరు, రాయపూడి, వెంకటపాలెం గ్రామాల్లో రాజధాని మహిళలు, రైతులు, రైతు కూలీలు భువనేశ్వరికి పూలతో స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో భువనేశ్వరి వెంట ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, గుంటూరు జిల్లా, నగర టీడీపీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్, డేగల ప్రభాకర్, గుంటూరు జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నాబత్తుని విజయలక్ష్మి అమరావతి రైతు జేఏసీ నేతలు పువ్వాడ సుధాకరరావు, గుర్రం చంటి తదితరులు పాల్గొన్నారు.

మంచి చేస్తా..

- రచ్చబండ ద్వారా ప్రజలు కష్టాలు తెలుసుకునేందుకే వచ్చా..!
- నాన్న నడిపిన పార్టీ పగ్గాలు పట్టుకుని మీ సేవకే వచ్చా
- జగనన్న వచ్చాక పరిశ్రమలు లేవు.. ఉద్యోగాలు లేవు
- ఇదే పాలన కొనసాగితే యువకులు రాష్ట్రం విడిచి వెళ్లాల్సిందే
- సంక్షేమం పేరుతో మట్టికుండ ఇస్తూ వెండి కుండ లాగుతున్న ప్రభుత్వం
- రాష్ట్రంలో లిక్కర్, మట్టి మాఫియా, భూదందాలు తప్ప పాలనేలేదు
- కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తాం
- కొలకలూరు రచ్చబండ కార్యక్రమంలో కాంగ్రెస్ ఏపీ చీఫ్ షర్మిల


ప్రజలకు అభివాదం చేస్తున్న షర్మిల

తెనాలి రూరల్, ఫిబ్రవరి 8: తన తండ్రి మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి రచ్చబండ ద్వారా నేరుగా ప్రజల కష్టాలు తెలుసుకున్నారని, అదే బాటలో తాను కూడా పయనిస్తూ మీ ముందుకు వచ్చానని కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. గురువారం మండలంలోని కొలకలూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి షర్మిల హాజరయ్యారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ తన తండ్రి దివంగత రాజశేఖర్ రెడ్డి ప్రజల కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేసి ప్రజానాయకుడిగా మిగిలారన్నారు. నాన్న నడిచిన బాటలోనే నడుస్తూ కాంగ్రెస్ పార్టీతో ప్రజలకు మంచి చేస్తానన్నారు. రచ్చబండ కార్యక్రమం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి నోటితోనే విని పరిష్కరించేందుకు తన వంతు కృషి చేయాలని వచ్చానని తెలిపారు. వైసీపీ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చలేకపోయిందని ఆరోపించారు. జగనన్న పాలనలో లిక్కర్, మట్టి, ఇసుక, భూదందాలు పెరిగిపోయాయని ప్రజాపాలన గాలికొదిలేశారని విమర్శించారు. తక్కువ ధరలకు భూములు కొని వాటిని పేదల ఇళ్ల పట్టాల పేరుతో వేల కోట్లు కొట్టేశారు. వేలమంది లబ్ధిదారులకు ఇల్లు ఇచ్చామని ప్రచారం చేస్తున్నారు క్షేత్రస్థాయిలో మాత్రం ఇల్లు రాలేదు.. పట్టాలు ఇవ్వలేదని ప్రజలు చెబుతున్నారని అన్నారు. అమ్మఒడి పథకం ద్వారా చదువుకునే ప్రతి బిడ్డకు రూ.15,000 ఇస్తానని ఆ నాడు చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చి తరువాత ఒక్క బిడ్డకే ఇస్తామని అది కూడా సంవత్సరానికి రూ.12,000 ఇస్తూ తల్లులను మోసం చేశాడని దుయ్యబట్టారు. మహిళలందరూ గమనించాలని సంవత్సరానికి ఇచ్చే రూ.10వేలు కనీసం కుటుంబ ఖర్చులకైనా సరిపోతాయా.. మరో బిడ్డ ఉన్న తల్లులు ప్రైవేటు స్కూల్‌లో చదివించాలంటే ఫీజులు ఎంత ఖర్చు అవుతాయో ఆలోచించాలన్నారు. జగనన్న ఇచ్చే సంక్షేమ పథకాల లబ్ధి మట్టి కుండ చేతిలో పెట్టి వెండికుండ లాక్కునట్లు ఉందన్నారు. అందుకు పెంచిన ధరలే సాక్ష్యమన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక హోదా తెస్తానని చెప్పిన జగనన్న కనీసం పోలవరం ప్రాజెక్టును కొంచెం కూడా ముందుకు నడపలేకపోయారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని, ఫలితంగా యువకుల నిరుద్యోగులుగా రాష్ట్రం విడిచిపెట్టి వెళ్ళాల్సి వస్తున్నదన్నారు. ఇదే ప్రభుత్వం కొనసాగితే రాష్ట్రంలో యువకులు పొరుగు రాష్ట్రాల్లో బతుకుదెరువుకు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. మెగా డీఎస్సీ అని చెప్పి దగా డీఎస్సీగా చూపారని జగనన్న పాలనను ఎండగట్టారు. రాష్ట్రంలో లిక్కర్, భూదందాలు, ఇసుక మాఫియాలతో రాష్ట్రం అట్టుడుకుతోందని అన్నారు. ఇదే పాలన కొనసాగితే రాష్ట్ర భవిష్యత్తు కనుమరుగైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలనను జనం గమనించి వచ్చే ఎన్నికల్లో రాజన్న, ఇందిరమ్మ రాజ్యాన్ని అధికారంలోకి తెచ్చుకుందామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రారంభమయ్యే రోజే రాహుల్‌గాంధీతో తొలిసంతకం రాష్ట్రానికి ప్రత్యేక హోదామీద పెట్టిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా గొప్పదని మంచి చేసే వారికే ఓటు వేయాలన్నారు. ప్రజల నుంచి దోచుకున్న డబ్బులను ఎన్నికల్లో ఖర్చు చేసేందుకు వెనుకాడని అవినీతి పార్టీల నుంచి ప్రజలు నిస్సందేహంగా వారు ఇచ్చే డబ్బులు తీసుకోవచ్చన్నారు. అవి మీ నుంచి దోచుకున్న డబ్బేనని వివిధ రకాల పన్నులు, పెంచిన నిత్యావసరాల ధరలు, కరెంట్ ఇతర వాటి నుంచి వసూలు చేసినవేనని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాజన్నబిడ్డగా తనను గెలిపించుకోవాలని ఆమె కోరారు. తొలుత దివంగత రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి షర్మిల, కాంగ్రెస్ నాయకులు పుష్పాంజలి ఘటించారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీమంత్రి కనుమూరి బాపిరాజు, గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు, మాజీ మంత్రి కేవీపీ రామచంద్రరావు, మాజీ ఎంపీ జేడీ శీలం, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు కొప్పుల రాజు స్థానిక పార్టీ నాయకులు చందు సాంబశివుడు, దారా రామకృష్ణ, పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశాలపై ఉక్కుపాదం

- ఎక్కడికక్కడ నోటీసులు.. అరెస్టులు
- చలో విజయవాడను అడ్డుకున్న పోలీసులు
- ఎన్నారై సమీపంలో జాతీయ రహదారిపై మెరుపు ధర్నా
- బైఠాయించిన మహిళలను ఈడ్చివేసి స్టేషన్లకు తర లింపు
- వడ్డేశ్వరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆశాల నిర్బంధం


ఆశా కార్యకర్తలను లాగి పడేస్తున్న పోలీసులు


విజయవాడ-గుంటూరు హైవేపై కొలనుకొండ వద్ద రాస్తారోకో చేస్తున్న ఆశా కార్యకర్తలు

మంగళగిరి సిటీ, తాడేపల్లి, ఫిబ్రవరి 8: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు చేపట్టిన ఆందోళనపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. సీఐటీయూ అనుబంధ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ గురువారం చలో విజయవాడకి పిలుపునిచ్చింది. ఈ ఆందోళనకు అనుమతి లేదని ఎక్కడికక్కడ ఆశా వర్కర్లు, సీఐటీయూ నేతలకు పోలీసులు తొలుత నోటీసులు జారీ చేశారు. అయినా చలో విజయవాడకు బయల్దేరగా అరెస్టు చేసి వారిని స్టేషన్లలో నిర్బంధించారు. ఈ క్రమంలో పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం 9 గంటల సమయంలో ఆశా వర్కర్లు వందల సంఖ్యలో మంగళగిరి మండలం చినకాకాని వైజంక్షన్ వద్దకు చేరుకుని ప్రదర్శనగా ఏపీఐఐసీ భవన్‌లోని కార్యాలయం వద్ద ఆందోళనకు సిద్ధమయ్యారు. వీరి ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో ఎన్నారై ఆస్పత్రి వద్ద గౌతమ బుద్ధ రోడ్డుపై ఆశా వర్కర్లు బైఠాయించి మెరుపు ధర్నాకు దిగారు. మధ్యాహ్నం ఒకటిన్నర వరకు ధర్నా కొనసాగడంతో జాతీయ రహదారిపై పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వారిని బలవంతంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్లు, కల్యాణ మండపాలకు తరలించారు. ఆశా వర్కర్లు ప్రతిఘటించడంతో తోపులాట చోటుచేసుకుంది. దీంతో పలువురు సొమ్మసిల్లి పడిపోగా, గాజులు తదితరాలు గుచ్చుకోవడంతో పలువురి చేతులకు రక్తగాయాలయ్యాయి.

ప్రభుత్వ తీరు దుర్మార్గం

ఆశా వర్కర్ల ఆందోళనపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపి బలవంతంగా అరెస్టులు చేయడం దుర్మార్గమని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశాలచే వెట్టిచాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారానికి చొరవచూపడంలేదని విమర్శించారు. వేతనాలు పెంచాలని కోరుతున్న ఆశావర్కర్లను, సీఐటీయూ నాయకురాలు ధనలక్ష్మిని చర్చలకు పిలిచి అరెస్టు చేయడం అన్యాయమని సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి సుబ్బరావమ్మ అన్నారు. తాడేపల్లి వద్ద అరెస్టు చేసి దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌కు తరలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ అర్ధరాత్రి ఇళ్లలో ఉన్న వారిని మగపోలీసులతో అరెస్టు చేసి తీసుకురావడం దారుణమన్నారు. తమ నాయకురాలు ధనలక్ష్మి ఏమైందో ఇంత వరకూ చెప్పడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళగిరి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించిన ఆశా వర్కర్లను టీడీపీ నాయకులు పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఆశా వర్కర్లను పోలీసులు అడ్డుకుని అక్రమంగా నిర్బంధించడం దుర్మార్గమైన చర్య అని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య అన్నారు.

గేట్లకు తాళాలు వేసి నిర్బంధం..

చలో విజయవాడలో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆశా వర్కర్లు తాడేపల్లి మండలం వడ్డేశ్వరం ప్రాంతానికి వచ్చి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆగారు. సమాచారం తెలిసిన పోలీసులు విజ్ఞాన కేంద్రం గేటుకు తాళాలు వేసి సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ సహా ఆశా వర్కర్లందరినీ నిర్బంధించారు. దీంతో సీపీఎం నేత దొంతిరెడ్డి వెంకటరెడ్డి, వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు అక్కడకు వచ్చి తాళాలు తీయాలని పోలీసులతో వాదులాటకు దిగారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని అనంతరం గేటు తాళాలు తీశారు. ఈ మధ్యలో కొందరు ఆశాలు గేటు దూకి జాతీయ రహదారిపైకి చేరుకుని వాహనాలను అడ్డుకుని నినాదాలు చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ వడ్డేశ్వరం వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఎంత సేపటికి వారు నిరసన విరమించక పోవడంతో పోలీసులు బలవంతంగా ఈడ్చివేశారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన కార్యకర్త లక్ష్మి స్పృహతప్పి పడిపోయింది. అనంతరం వారిని తాడేపల్లి పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లకు తరలించి సాయంత్రం విడుదల చేశారు.

ఎక్కడికక్కడ నిర్బంధకాండ

నరసరావుపేట, ఫిబ్రవరి 8: ఆశావర్కర్లు చలో విజయవాడకు పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్లకు తరలించారు. జిల్లా నుంచి ఆశా వర్కర్లు ఎవరూ విజయవాడకు వెళ్లకుండా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఎక్కడికక్కడ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి నోటీసులు జారీచేశారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో పికెట్లు ఏర్పాటు చేశారు. రహదారులపై వాహన తనిఖీలు చేపట్టారు. ఆశా వర్కర్ల కదలికలపై నిఘా ఉంచారు. కోటప్పకొండ, కంభంపాడు, కారంపూడి, మాచర్ల పీహెచ్‌సీల పరిధిలోని ఆశా వర్కర్లను ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్లకు తరలించారు. విజయవాడ తరలివెళ్లిన అత్తలూరు ప్రాంత ఆశా వర్కర్లను అరెస్టు చేసి గుణదల వద్ద ఉన్న అనాథ శరణాలయంలో నిర్బంధించారు.


పోలీసులు అరెస్టు చేస్తున్న క్రమంలో సొమ్మసిల్లిన ఆశాలు


గుంటూరు: దిశ పోలీస్‌స్టేషన్ వద్ద ఆశావర్కర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న యూనియన్ ప్రధాన కార్యదర్శి కే ధనలక్ష్మి

నిలిచిన.. సేవలు

- స్తంభించిన డ్రైవింగ్ లైసెన్స్ సేవలు
- నాలుగు రోజులుగా ఇదే తంతు
- దరఖాస్తుదారులకు ఇక్కట్లు
- ఎప్పటికి సేవలు పునరుద్ధరిస్తారో ?



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

డ్రైవింగ్ లైసెన్‌లకు సంబంధించిన సేవలు స్తంభించాయి. నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి. దీంతో దరఖాస్తు దారులు ఇక్కట్లు పడుతున్నారు. నిలిచిపోయిన సేవలను ఎప్పటికి పునరుద్ధరిస్తారో తెలియని దుస్థితి నెలకొంది. రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ దరఖాస్తుదారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో రవాణా శాఖ పర్యవేక్షణలో ఉన్న సేవలు కేంద్ర రవాణా శాఖకు అనుసంధించారు. ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్‌ను నిలిపివేశారు. తమ చేతిలో ఏమీలేదని రవాణా శాఖ అధికారులు చేతులెత్తేస్తున్నారు.

రాష్ట్ర పరిధిలో వాహనాల డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ ఉండేది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖ వెబ్‌సైట్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లకు సంబంధించిన దరఖాస్తు చేసుకునేవారు. లైసెన్స్‌లకు సంబంధించిన స్లాట్‌లను కూడా వెబ్‌సైట్‌లోనే కేటాయించేవారు. ఎల్ఎల్ఆర్, పర్మినెంట్ ఇలా లైసెన్స్‌లకు సంబంధించిన దరఖాస్తులను వెబ్‌సైట్ ద్వారానే స్వీకరించేవారు. ఈ విధానంలో మార్పులు తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ రవాణా శాఖ పరిధిలో ఉన్న ఈ సేవలను కేంద్ర ప్రభుత్వ రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖకు అనుసంధానం చేశారు. ఈ శాఖ లైసెన్స్ జారీ కోసం పరివాహన్ సారథి అనే పేరుతో వెబ్‌సైట్‌ను ప్రవేశపెట్టింది. దీని ద్వారానే లైసెన్స్ సంబంధిత సేవలను పొందాల్సి ఉంది. అయితే ఈ వెబ్‌సైట్ గత నాలుగు రోజులుగా పనిచేయడంలేదు. పూర్తిగా స్తంభించిపోయింది. దీంతో లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకొనే పరిస్థితులు లేవు. దరఖాస్తు దారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ వెబ్‌సైట్ నిర్వహణలో భాగంగా సర్వీస్‌లు నిలిపివేయబడినట్లుగా రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తుల ప్రక్రియ నిలిచిపోయింది. లైసెన్స్‌ల కోసం దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు. ఈ సేవలు వెనువెంటనే పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

నన్నెంతో అగౌరవ పరిచారు

- ఏ కార్యక్రమానికి పిలుపు లేదు
- నరసరావుపేటలో జగన్ హామీ నెరవేరలేదు
- ఆత్మీయ సమావేశానికి వచ్చేవారికి బెదిరింపులు
- త్వరలో నిర్ణయాన్ని వెల్లడిస్తా: ఎమ్మెల్సీ జంగా

7లో..

ఐదేళ్ళుగా అబద్ధాల పాలనే..

- మూడు ముక్కల ఆటతో ఇప్పటికే 20 సంవత్సరాలు వెనక్కి
- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన సీఎం జగన్‌రెడ్డి
- 1514వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్‌లో
బీబీఏ, ఎంబీఏ

దిక్సూచి
DIKSUCHI

గ్వాలియర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్(ఐఐటీటీఎం)- బీబీఏ(టూరిజం అండ్ ట్రావెల్), ఎంబీఏ(టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నారు. వీటిని స్పెసిఫిక్ అండ్ జనరిక్ బిజినెస్ మాడ్యూల్స్, ఇండస్ట్రీ ప్రాక్టీసెస్, అకడమిక్ డెవలప్‌మెంట్స్, టూరిజం అండ్ బిజినెస్ స్టడీస్ తదితర అంశాలతో రూపొందించారు. ప్రోగ్రామ్‌లో భాగంగా సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లు, స్టడీ టూర్లు ఉంటాయి. నెల్లూరు సహా గ్వాలియర్, భువనేశ్వర్, నోయిడా, గోవా క్యాంపస్‌లు అందుబాటులో ఉన్నా యి. గోవాలో ఎంబీఏ ప్రోగ్రామ్ మాత్రమే ఉంది. ఐఐటీటీఎం నిర్వహించే అడ్మిషన్ టెస్ట్(ఐఏటీ) లేదా నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.



బీబీఏ(టూరిజం అండ్ ట్రావెల్): ఈ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. మొత్తం 375 సీట్లు ఉన్నాయి. నెల్లూరు క్యాంపస్‌లో 75, గ్వాలియర్ క్యాంపస్‌లో 112, భువనేశ్వర్ క్యాంపస్‌లో 75, నోయిడా క్యాంపస్‌లో 113 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. సీయూఈటీ 2023 స్కోర్ ఉన్నవారు ఐఏటీ 2024 రాయనవసరం లేదు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/10+2/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎంబీఏ(టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్): ఇది రెండేళ్ల వ్యవధిగల ఫుల్ టైం మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రస్తుత పరిస్థితుల్లో టూరిజం, ట్రావెల్ మేనేజ్‌మెంట్‌కు అవసరమైన అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ కోర్సుని రూపొందించారు. ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్ వంటి కోర్ సబ్జెక్టులతో పాటు స్పెషలైజేషన్ సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. అభ్యర్థులు వారి ఆసక్తి మేరకు టూర్ గైడింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, అడ్వెంచర్ టూరిజం, సప్లయ్ చెయిన్ అండ్ లాజిస్టిక్స్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. చివరి సెమిస్టర్లో ఆన్ జాబ్ ట్రెయినింగ్ ఉంటుంది.

సీట్లు: మొత్తం 750 సీట్లు ఉన్నాయి. నెల్లూరు క్యాంపస్‌లో 75, గ్వాలియర్ క్యాంపస్‌లో 334, భువనేశ్వర్ క్యాంపస్‌లో 112, నోయిడా క్యాంపస్‌లో 189, గోవా క్యాంపస్‌లో 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసే అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. మ్యాట్/క్యాట్/సీమ్యాట్/ఎక్స్‌ఏటీ/జీమ్యాట్/ఏటీఎంఏ/సీయూఈటీ వంటి జాతీయ పరీక్షల్లో ఒకటి రాసి అర్హత పొందిన అభ్యర్థులు సంస్థ నిర్వహించే అడ్మిషన్ టెస్ట్ రాయనవసరం లేదు. స్కోర్ కార్డ్ వ్యాలిడిటీ 2023 జూన్ 1 నుంచి 2024 మే 31 మధ్య ఉండాలి.

ఐఏటీ 2024 వివరాలు: ఈ టెస్ట్‌ని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం వంద మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ అవేర్‌నెస్ నుంచి 50, వెర్బల్ ఎబిలిటీ నుంచి 25, క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండు గంటలు.

- ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పిలుస్తారు. అడ్మిషన్ టెస్ట్/జాతీయ పరీక్ష స్కోర్‌కు 70 శాతం, గ్రూప్ డిస్కషన్‌కు 15 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకి 15 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తరవాత డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 5
- **ఐఏటీ 2024 తేదీ:** జూన్ 9
- **అకడమిక్ సెషన్స్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.iittm.ac.in

ఐడీబీఐ బ్యాంక్‌లో జూనియర్ అసిస్టెంట్ మేనేజర్లు

జాబ్ కార్నర్

మొత్తం ఖాళీలు 500

దేశవ్యాప్తంగా వివిధ జోన్లలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఐడీబీఐ బ్యాంక్ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. మణిపాల్(బెంగళూరు), నిట్టే(గ్రేటర్ నోయిడా) విద్యా సంస్థలతో కలిసి పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్) కోర్సు ద్వారా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ) ఆ పోస్టులను భర్తీ చేయనుంది.

అర్హత: ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి. వయసు 2024 జనవరి 31 నాటికి 21 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయోపరిమితి నిబంధనలో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: అర్హులైన అభ్యర్థులకు ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తారు. ప్రతిభ కనబర్చిన వారు పర్సనల్ ఇంటర్వ్యూలకు అర్హత సాధిస్తారు. అందులో ప్రతిభ, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా తుది ఎంపికలు చేపడతారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: ఫిబ్రవరి 12
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 26
ఆన్‌లైన్ పరీక్ష తేదీ: మార్చి 17
వెబ్‌సైట్: www.idbibank.in/

ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని పాఠశాల విద్యాశాఖ 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష'(ఏపీ టెట్-2024) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి ఉపాధ్యాయ నియామక పరీక్షలో 20 శాతం వెయిటేజీ కూడా ఉంటుంది. అభ్యర్థులు 1 నుంచి 5 తరగతుల బోధనకు 'పేపర్-1(ఎ, బి); 6 నుంచి 8 తరగతుల బోధనకు 'పేపర్-2(ఎ, బి)లో అర్హత సాధించాల్సి ఉంటుంది.

అర్హతలు: పేపర్‌ను బట్టి ఇంటర్మీడియట్, బ్యాచిలర్స్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీతో పాటు డీఈడీ/బీఈడీ/లాంగ్వేజ్ పండిట్ ఉత్తీర్ణులై ఉండాలి. 2023-24 విద్యా సంవత్సరం చివరి ఏడాది చదివే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం: ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) నిర్వహిస్తారు. రోజుకు రెండు సెషన్లలో పరీక్ష ఉంటుంది. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ఉంటుంది.

పరీక్ష రుసుము: రూ.750
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 18
పరీక్షల నిర్వహణ: ఫిబ్రవరి 27 నుంచి మార్చి 9
వెబ్‌సైట్: aptet.apcfss.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/AeojJL0లో
చదవండి.

'**ఈ**గల్' చిత్రంలో మునుపెన్నడూ చూడని రవితేజను ప్రేక్షకులు చూడబోతున్నారు. ఈ చిత్రం కాన్సెప్ట్‌లోనే విధ్వంసం ఉంది. కంటెంట్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది' అని దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని చెప్పారు. రవితేజ కథానాయకుడిగా ఆయన దర్శకత్వం వహించిన చిత్రం 'ఈగల్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. కావ్య థాపర్, అనుపమా పరమేశ్వరన్ కథానాయికలు. 'ఈగల్' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను కార్తీక్ మీడియాతో పంచుకున్నారు.

రాంబో, టెర్మినేటర్ తరహాలో...

కార్తీక్ ఘట్టమనేని



- 'ఈగల్'లో కథానాయకుడు సాధారణ పత్తి రైతులా కనిపిస్తాడు. కానీ ఓ అంతర్జాతీయ సమస్యపైన అతను పోరాటం చేస్తుంటాడు. 'రాంబో', టెర్మినేటర్' లాంటి సినిమాలను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేశారు. మనం కూడా అలాంటి ఒక సినిమా తీయాలనే ప్రయత్నంలోంచే 'ఈగల్' పుట్టింది. ఇదొక అద్భుతమైన యాక్షన్, డ్రామా ఎంటర్టైనర్. ప్రేక్షకులను అలరిస్తుంది. పూర్తి స్థాయి యాక్షన్ చిత్రం చేయాలనేది దర్శకుడిగా నా కల. అది 'ఈగల్'తో నెరవేరింది.
- పక్షుల్లో గద్దకు చాలా సునిశితమైన దృష్టి ఉంటుంది. సుదూరాన ఉన్న లక్ష్యాన్ని సైతం చూసి వేటాడుతుంది. ఈ సినిమాలో కథానాయకుడికి కూడా భవిష్యత్తులో జరగబోయే పరిణామాలను అంచనా వేయగల నైపుణ్యం ఉంటుంది. అందుకే 'ఈగల్' టైటిల్ పెట్టాం. హిందీలో 'సహదేవ్ వర్మ' టైటిల్‌తో విడుదల చేస్తున్నాం.
- 'ధమాకా' సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసే సమయంలో రవితేజకు కథ చెప్పాను. 'మంచి ఎంటర్టైనర్ అవుతుంది చేద్దాం' అని వెన్నుతట్టారు. ఈ సినిమా అంతటా ఆయన పాత్ర ఒకేలా ఉంటుంది. ఆయన ఎనర్జీ లెవల్స్ వేరే లెవల్లో ఉంటాయి. ఆయన నుంచి నేర్చుకోవాల్సింది క్రమశిక్షణ. ఆహారపు అలవాట్లు, నిద్రవేళలు కచ్చితంగా పాటిస్తారు.
- ఈగల్ సౌండ్ డిజైన్‌కే ఆరునెలలు పట్టింది. యూరప్‌లో రియల్ గన్స్‌తో షూట్ చేసి ఆ సౌండ్‌ని రికార్డ్ చేశాం. అలాగే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సహకారం మరువలేనిది. ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు కావలసిన వనరులు సమకూర్చేవారు.
- ఈ చిత్రంలో నవదీప్ నటన ఆశ్చర్యపరుస్తుంది. అనుపమా పరమేశ్వరన్ కథను ముందుకు నడిపించే పాత్రను పోషించారు. త్వరలో తేజ సజ్జతో ఓ చిత్రం చేస్తున్నాను.

ట్రూ లవర్ ఈ వాలెంటైన్ విన్నర్



మణికందన్, శ్రీ గౌరి ప్రియ, కన్న రవి ప్రధాన తారాగణంగా రూపొందిన తమిళ చిత్రం 'ట్రూ లవర్'. ఈ ప్రేమకథా చిత్రానికి ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వం వహించారు. దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ నెల 10న 'ట్రూ లవర్' విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఎస్‌కేఎన్ మాట్లాడుతూ 'తమిళ ప్రీమియర్స్ చూసిన వాళ్లు ఈ మధ్యకాలంలో ఇలాంటి సినిమా రాలేదని చెబుతున్నారు. తెలుగువాళ్లకూ ఈ సినిమా బాగా నచ్చుతుంది. పెయిడ్ ప్రీమియర్స్ వేస్తున్నాం. మణికందన్, గౌరీప్రియ నటన ఆకట్టుకుంటుంది. ఈ సినిమా ఈ వాలెంటైన్ డే విన్నర్ అవుతుంది. 'బేబీ' హిందీ రీమేక్‌లో నేను నటించడం లేదు' అని తెలిపారు. మారుతి మాట్లాడుతూ 'ట్రూ లవర్' కథను దర్శకుడు సహజంగా తెరకెక్కించాడు. దర్శకుడి ప్రతిభ అబ్బురపరుస్తుంది. ప్రేమికులే కాదు కుటుంబం అంతా కలసి చూసే సినిమా ఇది' అన్నారు. మణికందన్ మాట్లాడుతూ 'పక్కా స్క్రీన్‌ప్లేతో తీసిన సినిమా ఇది. ఇక్కడి ప్రేక్షకులు నన్ను తెలుగు నటుడిగానే చూస్తున్నారు. మారుతి, ఎస్‌కేఎన్ రిలీజ్ చేయడం వల్ల ఈ సినిమా స్థాయి పెరిగింది' అని చెప్పారు. శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ 'ఈ చిత్రం తమిళ ప్రీమియర్స్‌కు ప్రేక్షకుల నుంచి చక్కటి స్పందన వస్తోంది. తెలుగులో సూపర్ హిట్ అవుతుందని నమ్ముతున్నాం' అన్నారు.

నవ్వించే గూఢచారి



హాస్య నటుడు వెన్నెల కిశోర్ హీరోగా నటించిన 'చారి 111' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. టీజీ కీర్తికుమార్ దర్శకత్వంలో ఆదితి సోని నిర్మించిన సినిమా ఇది. సంయుక్త విశ్వనాథన్ హీరోయిన్‌గా నటించారు. కన్‌ఫ్యూజ్ అయ్యే గూఢచారిగా వెన్నెల కిశోర్ కనిపిస్తారని దర్శకనిర్మాతలు చెప్పారు. 'ఇదొక స్పై యాక్షన్ కామెడీ సినిమా. సిల్లీ మిస్టేక్స్ చేసే గూఢచారి ఒక పెద్ద కేసుని ఎలా పరిష్కరించాడన్న అంశంతో చిత్రాన్ని రూపొందించాం. వెన్నెల కిశోర్, సంయుక్త గూఢచారి పాత్రలు పోషించారు. వాళ్ల బాస్‌గా మురళీశర్మ కీలక పాత్ర చేశారు.' అని దర్శకుడు చెప్పారు. గూఢచారి చిత్రాల్లో 'చారి 111' కొత్తగా ఉంటుందని నిర్మాత తెలిపారు. త్వరలో పాటలు, ట్రైలర్‌ను విడుదల చేస్తామని చెప్పారు.

లవ్ జిహాద్ డ్రిల్



అమెరికాలో డాక్టర్‌గా సెటిల్ అయిన హరనాథ్ పొలిచర్ల సినిమా మీద మమకారంతో ఇండియా వచ్చి చిత్రాలు తీస్తుంటారు. స్వీయ దర్శకత్వంలో ఆయన నిర్మించిన తాజా చిత్రం 'డ్రిల్' ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినిమా టీజర్‌ను విడుదల చేశారు. సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై హరనాథ్ మరెన్నో సినిమాలు తీయాలనీ, 'డ్రిల్' చిత్రం విజయవంతం కావాలనీ కోరారు. డాక్టర్ హరనాథ్ మాట్లాడుతూ 'నాకు చిన్నప్పటి నుంచి సినిమాలంటే ఇష్టం. ఆ కారణంగానే ఇప్పటివరకూ ఎనిమిది సినిమాలు తీశా. అమెరికాలో డాక్టర్ వృత్తిలో ఎంత బిజీగా ఉన్నా ఎప్పటికప్పుడు సినిమా అప్డేట్స్ తెలుసుకుంటుంటాను. లవ్ జిహాద్ మీద తెలుగులో ఇంతవరకూ ఒక్క సినిమా కూడా రాలేదు. అందుకే ఆ కాన్సెప్ట్‌తో స్క్రిప్ట్ రెడీ చేసుకుని ఇండియాకు వచ్చి సినిమా తీశా. ఇంతవరకూ నేను చేసిన సినిమాలకు ఇది భిన్నంగా ఉంటుంది' అన్నారు. కారుణ్య చౌదరి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో భవ్య, సిపిగంధ, తనికెళ్ల భరణి, జెమినీ సురేశ్, కోటేశ్వరరావు, సత్తన్న, విశ్వ , జబర్దస్త్ ఫణి తదితరులు నటించారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/xepzBEN
లో చదవండి.

రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



పిడుగురాళ్ల, ఫిబ్రవరి 8: రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీని తలపించేలా వుందని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అంచనాలు చూస్తే కొండంత.. ఖర్చులు చూస్తే పిసిరంత సామెతలా రాష్ట్ర బడ్జెట్ వుందని మండిపడ్డారు. రూ.13 వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44 వేల కోట్లకు, రూ.35 వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో అభివృద్ధి అంశాలు ఏమీ లేవన్నారు. ప్రస్తుతం ఏపీ అప్పులు 11.58 లక్షల కోట్లు, మద్యం బాండ్లు 16,000 కోట్లు, కార్పొరేషన్ హామీలు 1,10,603 కోట్లు, కార్పొరేషన్ తనఖాలు 94,928 కోట్లు, డిస్కం బకాయిలు 27,284 కోట్లు, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు 95,400 కోట్లు, ఇలా వైసీపీ హయాంలో రాష్ట్ర అప్పులు రెట్టింపు అయ్యాయన్నారు. 2019లో టీడీపీ తీసుకున్న దానికంటే నాలుగు రెట్లు అధికంగా వైసీపీ ప్రభుత్వం అప్పు తీసుకొని ఏపీని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలను జగన్ సర్కార్ భారీగా పెంచడంతో పాటు విద్యుత్ చార్జీల వడ్డనలో కూడా వైసీపీ ప్రభుత్వం ఎక్కడా రాజీపడలేదన్నారు. విద్యార్థులకు ఇచ్చే ట్యాబ్‌ల్లోనూ వెయ్యి కోట్ల అవినీతి, నాడు-నేడు పేరుతో స్కూళ్లకు రంగులు వేసి రూ.3 కోట్ల అవినీతికి వైసీపీనేతలు పాల్పడ్డారన్నారు. జగనన్న విద్యా దీవెనలో 7 లక్షల మంది విద్యార్థులకు వాత పెట్టారని, మద్యం మీద వచ్చే డబ్బుతో సీఎం జగన్ ప్రభుత్వం నడుస్తుందన్నారు. నాసిరకం మద్యంతో 30 వేల మందిని జగన్ ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని ఆరోపించారు. రైతు భరోసా ద్వారా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించి సున్నా వడ్డీ పంట రుణాలను రూ.5లక్షల నుంచి రూ.3లక్షలకు కుదించారన్నారు. జీవోనెం.217 ద్వారా మత్స్యకారుల కడుపు కొట్టారని, నేతన్నహస్తం పేరుతో నేతన్నల కుటుంబాలను దగా చేశారన్నారు. సబ్‌ప్లాన్ నిధులు రూ.75 వేల కోట్లు దారి మళ్లించి 30 పథకాలను రద్దు చేశారని యరపతినేని శ్రీనివాసరావు ఆరోపించారు.

మెగా కాదు.. దగా డీఎస్సీ

● రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



రేపల్లె, ఫిబ్రవరి 8: జగన్‌రెడ్డి వదిలింది మెగా డీఎస్సీ కాదని, దగా డీఎస్సీ అని రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 50,892 టీచర్ ఖాళీలు ఉంటే 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వటం నిరుద్యోగులను వంచించటమేనన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డీఎస్సీ పేరుతో జగన్‌రెడ్డి కొత్త డ్రామాకు తెరతీశారన్నారు. జనవరి 1న జాబ్‌క్యాలండర్ విడుదల చేస్తారని, నాలుగున్నరేళ్లలో జగన్ చేసింది ఏమీ లేదన్నారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్ళు చల్లేలా మంత్రి బొత్స కల్లబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. ఎన్నికల హామీలో భాగంగా చేసిన మెగా డీఎస్సీ జాబ్ క్యాలెండర్ 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ ఏమయ్యాయనే ప్రశ్నకు జగనే సమాధానం చెప్పాలన్నారు. జగన్ నిర్వాకంతో దేశవ్యాప్తంగా 11శాతం నిరుద్యోగం ఉంటే, ఏపీలో 24శాతం ఉందన్నారు. యువతను వంచించి రాష్ట్రాన్ని నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌దేనన్నారు. కల్తీ మద్యం అమ్మకాల్లో మద్యాంధ్రప్రదేశ్‌గా గంజాయి ఉత్పత్తిల్లో రాష్ట్రాన్ని నెం.1గా చేసి గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

పాఠశాల విద్య ఆర్జేడీ బాధ్యతల స్వీకారం

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 8: గుంటూరు జోన్ (గుంటూరు, ప్రకాశం, నెల్లూరు) పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు బి.లింగేశ్వరరెడ్డి గురువారం డీఈవో కార్యాలయంలో ఆర్జేడీ విభాగంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎ.తిరుమలేష్, గౌరవాధ్యక్షులు జె.సురేష్‌కుమార్, రాష్ట్ర కేంద్ర సహాధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, గుంటూరు సీజే మణికుమార్, ప్రధాన కార్యదర్శి ఎన్వీ నాగమణి, తెనాలి డివిజన్ అధ్యక్షులు వీరాస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, మునిసిపల్ ప్రతినిధులు జిలానిబాషా, శ్రీనివాసరావు, వేణుగోపాలరావు, ఎయిడెడ్ ప్రతినిధి ఎస్.శ్రీనివాసరావు, మహిళా ప్రతినిధి జయప్రద, ఎంఈవో రోజ్‌లాండ్, ఉమ్మడిజిల్లా పరీక్షల బోర్డు సెక్రటరీ లలితప్రసాద్, ఎస్టీయూ నేతలు పెదబాబు, డీకే సుబ్బారెడ్డి, జోసెఫ్ సుధీర్‌బాబు తదితరులు పుష్పగుచ్చాలు అందజేసి, ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

బడ్జెట్‌లో మోసపు మాటలు, అంకెల గారడీ

● వైసీపీ పాలనలో రూ.11.58 లక్షల కోట్ల అప్పులు
● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



మార్ఫింగ్ ఫొటోలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జీవీ, అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 8: అంకెలగారడీ, మాయమాటలు, మోసపు మాటలు తప్ప రాష్ట్ర బడ్జెట్‌లో ఏమీ కనిపించడం లేదని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. గురువారం నరసరావుపేటలోని పల్నాడు టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత రూ.11.58 లక్షల కోట్లు అప్పుల పాలు చేశారని అన్నారు. మరో పక్క జగన్‌మోహన్‌రెడ్డి రూ.4 లక్షల కోట్లుపైన దోచుకున్నాడని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి లూటీ వలన రాష్ట్రంలో సంక్షేమం తగ్గిపోయిందని, కేవలం 14 శాతం మాత్రమే సంక్షేమానికి ఖర్చు చేస్తున్నారని అన్నారు. గోదావరి, పెన్నా అనుసంధానం వలన రెండు పంటలు పండిచు కోవచ్చునన్నారు. చంద్రబాబునాయుడు ప్రారంభించిన అనుసంధానం పనులు వైసీపీ ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నిర్వాకం వలన పల్నాడు, ప్రకాశం జిల్లాల రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. వరికపూడిశల ప్రాజెక్టు శంకుస్థాపనచేసి నిధులు కేటాయించపోవడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. రాబోయే టీడీపీ జనసేన ప్రభుత్వంలో వరికపూడిశల కచ్చితంగా పూర్తి చేస్తామన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌కు రైతులకు డబ్బులు ఇవ్వకుండా దేశం డ్రిప్ ఇరిగేషన్ రెండవ స్థానంలో ఉందని చెప్పుకోవడాని సిగ్గుందా? అన్నారు. 23వేల టీచరు పోస్టులు ఉంటే కేవలం 6,100 ప్రకటించడం నిరుద్యోగలను వంచించడమే అన్నారు. రాష్ట్రంలో పేటీఎం బ్యాచ్ అరాచక చర్యలు శృతిమించుతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు యోగా చేసిన ఫొటోలను, వీడియోలను మార్ఫింగ్‌చేసి అమిత్‌షా కాళ్ళు మొక్కుతున్నట్లు పెట్టడం అత్యంత దుర్మార్గం, నీచమైన చర్యయని దుయ్యబట్టారు. జగన్‌రెడ్డిలా రాష్ట్రప్రయోజనాలు తాకట్టుపెట్టి సొంత ప్రయోజనాల కోసం ప్రధాని కాళ్ళు పట్టుకోలేదని జీవీ ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ చర్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నన్నెంతో అగౌరవ పరిచారు

● ఏ కార్యక్రమానికి పిలుపులేదు
● నర్సరావుపేటలో జగన్ హామీ నెరవేరలేదు
● ఆత్మీయ సమావేశానికి వచ్చేవారికి బెదిరింపులు
● త్వరలో నిర్ణయాన్ని వెల్లడిస్తా: ఎమ్మెల్సీ జంగా

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 8: ముప్పై ఐదేళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూచూడని అగౌరవాన్ని ఈఐదేళ్లలో చూశానని, అనుభవించానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తెలిపారు. గురువారం రాత్రి పిడుగురాళ్లలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో జంగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఆనాడు నరసరావుపేటలో జగన్ నాకు మాటిచ్చాడని.. ఎమ్మెల్సీని చేసి ఆ తర్వాత మంత్రివర్గంలో తర పక్కనే కూర్చోబెట్టుకుంటానన్న జగన్ ఆ తర్వాత మాట నిలబెట్టుకోలేదన్నారు. 2019 ఎన్నికలకు ముందే ఎమ్మెల్సీ పదవి జగన్ ఇస్తానన్నా.. ఇప్పుడే ఇస్తే ఎన్నికల్లో తన గెలుపునకు పనిచేయడేమోనని కాసు చెప్పడంతో ఎన్నికల య్యాక మాత్రమే తనకు పదవి ఇచ్చారన్నారు. ఎన్నికల్లో గెలిచాక పిడుగురాళ్లకు వచ్చి ర్యాలీ చేసిన కాసు ఆ కార్యక్రమానికి తనను పిలవలేదన్నారు. నాలుగున్నరేళ్లలో ఏకార్యక్రమానికి పిలుపు లేక పోగా నాకార్యాలయానికి ఎవరినీ రానివ్వకుండా నిఘా పెట్టారన్నారు. అదే విషయాన్ని జగన్‌కు, పార్టీ పెద్దలకు చెప్పినా పట్టించుకోలేదని జంగా ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ఆనాడు పార్టీ పెడతాడో లేదో తెలియని పరిస్థితుల్లో జగన్ కోసం పిడుగురాళ్ల నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేశానని గుర్తుచేశారు. పార్టీ కోసం పనిచేసిన నన్ను 2019 ఎన్నికల తరువాత నన్ను అన్ని కార్యక్రమాలకు దూరం పెట్టారని జంగా ఆవేదన వెల్లగక్కారు. అంతేకాకుండా నా ఆత్మగౌరవంపై దెబ్బకొట్టడం నన్నెంతో బాధించిందని, తనకు గాని.. గామాలపాడు సర్పంచ్‌గా వున్న నా కుమారుడు సురేష్‌కి కూడా సమాచారం ఇవ్వకుండా ఎలా సమావేశం పెడతారని ప్రశ్నించిన విషయాన్ని గుర్తుచేశారు. మీ పదవి కోసం, సంపాదన కోసం గ్రామాల్లో చిచ్చుపెట్టొద్దని, రెండుసార్లు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం ఎమ్మెల్సీగా చేస్తున్నా నియోజకవర్గ అభివృద్ధికి, బడుగు బలహీనవర్గాల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్న నన్ను ఎన్నో ఇబ్బందులు పెట్టినా ఇప్పటిదాకా ఓర్చుకున్నానన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు కూడా నా మాట వినే పరిస్థితి లేకుండా చేయడం నన్నెంతో బాధించిందన్నారు. గురజాల ప్రజలకు తానేంటో తెలుసని, నా చివరి శ్వాస వరకు గురజాల అభివృద్ధికి, బడుగు బలహీనవర్గాల సంక్షేమానికే పాటుపడతానని జంగా స్పష్టం చేశారు. ఆత్మీయ సమావేశానికి పలు గ్రామాల నుంచి రానివ్వకుండా భయపెట్టి బెదిరించారని గుర్తుచేస్తూ అలా ఎన్నటికీ బెదిరిపోరని.. ఎదురు తిరిగే రోజులు దగ్గరలోనే వున్నాయన్నారు. ఈదఫా ఎమ్మెల్యే సీటు కేటాయించమని వైసీపీ పెద్దలను అడిగా.... కానీ వినే పరిస్థితి అక్కడ లేదన్నారు. బీసీల ఆత్మగౌరవం దెబ్బతీస్తూ ఆత్మవంచనతో బతకలేరని, రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి బీసీలకు జరుగుతున్న అన్యాయాలను వివరిస్తానని జంగా తెలిపారు. ఆత్మీయుల మనోభావాలను గుర్తుంచుకొని ఓనిర్ణయానికి త్వరలో వస్తానన్నారు. 2009లో గురజాల కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆత్మీయులందరినీ జగన్ దూరం చేసుకుంటున్నాడని, నేను జగన్ అభిమానినే అయినా పరిస్థితి బాగోలేదు. బడుగు బలహీనవర్గాల వారందరం జంగావైపే వుంటామన్నారు. ఆత్మీయ సమావేశానికి గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి సుమారు 4వేల మంది హాజరయ్యారు. వేదికపై అత్తోట రామనరసింహారావు, నంద్యాల ధనుంజయరెడ్డి, గుండా శ్రీనివాసరావు, కొత్త సాంబశివరావు,మద్దాళి సుబ్బయ్య, నంద్యాల వెంకటేశ్వరరెడ్డి, ముడేల సుబ్బారెడ్డి, మాశెట్టి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

బడ్జెట్‌లో పన్నుల బాదుడే..

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

పెదకూరపాడు, ఫిబ్రవరి 8: బుగ్గన బడ్జెట్ అంతా అంకెల గారడీనేనని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుగ్గన బడ్జెట్ అంచనాలు కొండంత అని, ఖర్చులు పిసరంత అని, రూ.13వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44వేల కోట్లకు, రూ 35వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనన్నారు. పన్నులు బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలేమి లేవని, ప్రస్తుతం ఏపీ అప్పులు రూ.11.58 లక్షల కోట్లని, మద్యం బాండ్లు రూ.16వేల కోట్లు అని, కార్పోరేషన్ హామీలు రూ.1,10,603 కోట్లు అని, కార్పొరేషన్ తనఖాలు రూ.94,928 కోట్లు అని, డిస్కం బకాయిలు రూ.27,284 కోట్లు అని, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు రూ.95,400 కోట్లు అని వివరించారు. వైఎస్‌ఆర్ సీపీ హయాంలో రెట్టింపు అయిన ఏపీ అప్పులు, 2019లో టీడీపీ తీసుకున్న దాని కంటే నాలుగు రెట్లు అప్పు ఎక్కువ అని అయన వివరించారు. అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా ఏపీని మార్చిన జగన్ అండ్ కో వైసీపీ హయాంలో తీసుకు వచ్చిన ప్రతి స్కీమ్ ఓ స్కామ్‌గా మారిందని కొమ్మాలపాటి అన్నారు.



పాదయాత్రలో నాగమల్లేశ్వరరావు తదితరులు

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

● జాతీయ దోబీ మహా సంఘం అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు

గుంటూరు, ఫిబ్రవరి8: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే వరకు మహా ఉద్యమాన్ని చేపడతామని జాతీయ దోబీ మహా సంఘం జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్‌తో తిరుపతి నుంచి విజయవాడకు పాదయాత్ర చేపట్టిన ఆయన గురువారం సాయంత్రం చుట్టుగుంట సెంటర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తాను చేపట్టిన పాదయాత్ర 19వ రోజుకు చేరిందని, ఇప్పటివరకు 452కిలోమీటర్ల వరకు పాదయాత్ర చేసినట్లు ఆయన తెలిపారు. 1950లో కేంద్రప్రభుత్వం గెజిట్లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్నప్పుడు రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని గుర్తుచేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశాన్నే వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పక్షాలు తమ మేనిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజకసంఘాల నేతలు పాల్గొన్నారు.

దేవదాయ శాఖలో ఉద్యోగోన్నతులు

● గుంటూరు డీసీగా మహేశ్వర్‌రెడ్డి

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 8: దేవదాయ శాఖలో పలువురికి ఉద్యోగోన్నతి కల్పిస్తూబుధవారం రాత్రి రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరు జిల్లాలో ఇన్‌చార్జి డీసీగా ఉన్నా ఈ.చంద్రశేఖర్‌రెడ్డి హెడ్ ఆఫీస్‌కి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. గుంటూరు జిల్లా ఎండోమెంట్ ఏసీ బొంతు మహేశ్వర్ రెడ్డిని గుంటూరు రీజియన్ రెగ్యులర్ డీసీగా నియమించారు. అదేవిధంగా ఎన్టీఆర్ జిల్లా నెమలిలో ఉన్న ఆలయ ఏసీని డీసీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానానికి ఈవోగా నియమించారు. ప్రకాశం జిల్లా సింగరకొండ నరసింహస్వామి దేవస్థానం ఈవోగావున్న కేబీ శ్రీనివాస రావుకు డీసీగా పదోన్నతిస్తూ అదే ఆలయంలో కొనసాగాలని ఆదేశించారు. పొన్నూరు భవన్నారాయణ స్వామి దేవస్థానం ఈవో రవణమ్మను శ్రీశైలం దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారిగా బదిలీ చేశారు.



సీఎం కాన్వాయ్ వెళ్లేటప్పుడు మందడం శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న రైతులు

ఐదేళ్ళుగా అబద్ధాల పాలనే..

● మూడు ముక్కల ఆటతో ఇప్పటికే 20 సంవత్సరాలు వెనక్కి
● రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన సీఎం జగన్‌రెడ్డి
● 1514 రోజుకు చేరిన రైతుల ఆందోళనలు

తుళ్ళూరు ఫిబ్రవరి 8: పోలవరం పూర్తి చేస్తాం.. అమరావతిని బ్రహ్మాండంగా కడతాం.. మద్యాన్ని నిషేధిస్తామని సీఎం జగన్‌రెడ్డి ఐదేళ్లుగా అబద్ధాలతో పాలన చేస్తున్నాడని రాజధాని అమరావతి నిర్మాణానికి భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళలు గురువారం నాటికి 1514వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ.. అమరావతిని నిర్వీర్యం చేస్తూ, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, 20 సంవత్సరాలు వెనకబాటుతనానికి సీఎం జగన్‌రెడ్డి గురి చేశాడన్నారు. అమరావతి అభివృద్ధి కొనసాగింపుతో లక్షల కోట్లు సంపద రాష్ట్రానికి వచ్చేదన్నారు. మూడుముక్కల ఆటతో అది కూడ లేకుండా చేశాడన్నారు. అసెంబ్లీ సమావేశాల చివరిరోజు సీఎం జగన్ కాన్వాయ్ మందడం ధర్నా శిబిరం మీదుగా వెళుతున్న సమయంలో రైతులు బైబై సీఎం అంటూ నినాదాలు చేశారు. ధర్నా శిబిరం నుంచి రైతులు బయటకు రాకుండా పోలీసులు భారీగా మోహరించారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి జై అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు.

1,41,466 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,41,193 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,35,466 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 93,415 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	10000	18000
273	9500	21500
341	9500	21500
4884	9000	19500
సూపర్ 10	12000	18000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	22000
బ్యాడిగి	9500	21500
దేవనూరు డీలక్స్	9000	20500
తెల్లకాయలు	5000	12000

విష్ణుపురం-మోటుమర్రి రైల్వే డబ్లింగ్‌కు

కేంద్ర క్యాబినెట్ ఆమోదం

● రూ. 1,746.20 కోట్ల నిధుల మంజూరు
● కాజీపేట మార్గానికి ప్రత్యామ్నాయ మార్గంగా సేవలు

గుంటూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విష్ణుపురం - మోటుమర్రి రైల్వే సింగిల్‌లేన్‌ని డబ్లింగ్ చేసేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. కాజీపేట మార్గానికి ఇది ప్రత్యామ్నాయంగా ఉపయోగపడనుండటంతో ఈ నిర్ణయాన్ని తీసుకొన్నది. ఇప్పటికే నల్లపాడు - బీబీ నగర్ డబ్లింగ్ ప్రాజెక్టుకి ఈఏడాది బడ్జెట్‌లో నిధులను కేటాయించిన రైల్వే శాఖ తాజాగా 88.82 కిలోమీటర్ల విష్ణుపురం-మోటుమర్రి సెక్షన్ డబ్లింగ్‌కు నిధులు కేటాయించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతుంది. ఈ డబ్లింగ్ ప్రాజెక్టు వలన సరుకు రవాణ గణనీయంగా పెరగనుంది. అలానే కాజీపేట మార్గంలో రైళ్ల రద్దీ కూడా తగ్గుతుందని రైల్వేవర్గాలు చెబుతున్నాయి. విష్ణుపురం సమీపంలో 4వేల మెగావాట్ల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం జరుగుతున్నది. అలానే చుట్టుపక్క అనేక సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఎఫ్‌సీఐ సైడింగ్‌లు, వేర్‌హౌస్‌లు, కోల్డ్‌స్టోరేజ్‌లు, ఇనుము, ఉక్కు పరిశ్రమలు ఉండటంతో రాబోయే రోజుల్లో ఇదొక సరుకు రవాణ హబ్‌గా మారనుంది. దీనిని పరిగణనలోకి తీసుకొన్న కేంద్ర ప్రభుత్వం విష్ణుపురం - మోటుమర్రి సెక్షన్ డబ్లింగ్‌ని ఆమోదించింది. ఇందుకోసం రూ. 1,746.20 కోట్లు కేటాయించింది.

10.87 కిలోమీటర్ల పొడవునా రైల్ వోవర్ రైలు ..

డబ్లింగ్ చేపట్టనున్న ఈ సెక్షన్‌లో 10.87 కిలోమీటర్ల పొడవునా రైల్ వోవర్ రైలుని కూడా నిర్మించనున్నారు. ఇప్పటికే మోటుమర్రి ఒక జంక్షన్‌గా మారింది. దీంతో అక్కడ రైల్ వోవర్ రైల్ నిర్మించక పోతే రైళ్ల క్రాసింగ్‌ల సమస్య తలెత్తే అవకాశంవుంది. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ ఆర్‌వోఆర్‌ని నిర్మించాలని నిర్ణయించింది.

గిరిజన విద్యార్థుల మృతి సీఎంకు పట్టదా ?

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్

గుంటూరు, ఫిబ్రవరి 8: ఏడాదిలో 40 మంది గిరిజన విద్యార్థులు మృతి చెందుతుంటే సీఎం జగన్ రెడ్డికి పట్టదా? అని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్ ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చిట్టంపాడు గిరిజన బాలిక మరణంపై సెంట్రల్ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వంలో గిరిజనులకు డోలీల కష్టాలు తీవ్రమయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఐదేళ్ల అధికారం పూర్తి కావస్తున్నా జగన్ రెడ్డి ఏజెన్సీ గిరిజన గ్రామాలలో ఒక్క రోడ్డు కూడా వేయలేదన్నారు. రోడ్లు లేక, వైద్యం అందక గిరిజనులు మృత్యువాత పడుతున్నారన్నారు. జగన్ రెడ్డి నిర్లక్ష్య ధోరణితో నేడు ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో ఆదిమకాలం నాటి పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వం గిరిపుత్రులనే హెల్త్ అసిస్టెంట్లను నియమిస్తే వారినీ తొలగించారు. గిరిజన గూడేల్లో హెల్త్ చెకప్‌లను నిలుపుదల చేశారని మండిపడ్డారు. గిరిజన హాస్టళ్లలో గత ఏడాది నుంచి నేటి వరకు రాష్ట్రంలో దాదాపు 40 మంది గిరిజన విద్యార్థులు అనారోగ్యాల బారినపడి మృత్యువాత పడ్డారన్నారు. ఇటీవల విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం, గిరిశిఖర గ్రామం, చిట్టంపాడుకు చెందిన ఆరేళ్ల బాలిక అనారోగ్యంతో మరణించిడం తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

10న నవోదయ ప్రవేశ పరీక్ష

చిలకలూరిపేట,ఫిబ్రవరి8: చిలకలూరిపేట మండలం మద్దిరాలలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2024 - 25 సంవత్సరంలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు విద్యాలయం ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు గురువారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 950 మంది, 11వ తరగతి ప్రవేశ పరీక్షకు 582 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్‌తో పాటు ఆధార్ కార్డును తీసుకొని నిర్ణీత సమయంలో కేటాయించిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. హాల్ టిక్కెట్లు లేని వారు నవోదయ వెబ్‌సైట్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని కూడా ఆయన తెలిపారు.

ఎన్నికల సభలా ఆసరా చెక్కుల పంపిణీ

కొల్లూరు, ఫిబ్రవరి 8: ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం ట్రాఫిక్ మళ్లించి మరీ నడిరోడ్డుపై నిర్వహించడం పలు విమర్శలకు దారి తీసింది. గురువారం మండల కేంద్రం కొల్లూరులో మండల వనరుల కేంద్రం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు తెనాలి-రేపల్లె ప్రధాన రహదారిపై ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఇందుకోసం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి వాహన రాకపోకలు నిలిపి వేసి ఇతర మార్గాల్లో ట్రాఫిక్ మళ్లించారు. వైసీపీ నాయకులు దీనిని ఎన్నికల ప్రచార సభలాగా వినియోగించుకున్నారు. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు అందుతాయని, లేదంటే అందవని మహిళలను భయపెట్టే విధంగా మంత్రి మేరుగు నాగార్జున, ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబుల ప్రసంగం ఉందని, ప్రభుత్వ కార్యక్రమమా! ఎన్నికల ప్రచారమా అని పలువురు ఆరోపిస్తున్నారు. పైగా వేలిముద్రలు వేయాలని డ్వాక్రా మహిళలను, ఇళ్ల స్థలాలు పొందిన వారిని మభ్యపెట్టి సభకు రప్పించారని మహిళలే సభా ప్రాంగణం వద్ద బహిరంగంగానే చెబుతుండటం గమనార్హం. మధ్యాహ్నం 1 గంటకు సభ అని పిలిపించి రాత్రి 7 గంటలకు పైగా అక్కడే ఉండేలా చేయడంతో కార్యక్రమానికి వచ్చిన మహిళలు అసహనానికి గురయ్యారు.


రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● పాత నేరస్తుడిగా గుర్తింపు ● మృతుడు ప్రకాశం జిల్లా వాసి

వేమూరు, ఫిబ్రవరి 8: మండలంలోని జంపని గ్రామ శివారులో ఉన్న సినిమా హాలు సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. అతనిని ప్రకాశం జిల్లా పేర్నమెట్ట మండలం పేర్ల మాణ్యం గ్రామానికి చెందిన షేక్ రసూల్ బాషా కుమారుడైన రాహుల్(23)గా పోలీసులు గుర్తించారు. కొల్లూరు- తెనాలి ప్రధాన రహదారిపై తెనాలి వైపునకు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా ఫోన్ మాట్లాడుతూ ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీ కొట్టాడు. దీంతో మెదడుకు తీవ్రంగా దెబ్బ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు, మరో స్లిప్‌ను వేమూరు రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ రాజశేఖర్‌లు పరిశీలించారు. అతనిపై రేపల్లె ప్రాంతంలో 10 చోరీ కేసులు, తెలంగాణాలోని మేడ్చల్ ప్రాంతంలో 7కేసులు, గుంటూరు రూరల్ ప్రాంతంలో 1, తెనాలి ప్రాంతంలో 1కేసు నమోదై ఉన్నట్లు గుర్తించారు. ఆధార్ కార్డు ఆధారంగా సేకరించిన సమాచారాన్ని ప్రకాశం జిల్లా పోలీసులకు సమాచారం తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు.

బయోలపై విజిలెన్స్ కన్నెర్ర

● రూ.6.10 లక్షల విలువైన నకిలీ మందులు పట్టివేత



బయో స్టిమ్యులెంట్స్ స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 8: గడచిన రెండు నెలల వ్యవధిలో జరిపిన దాడుల్లో అధిక మొత్తంలో నకిలీబయో మందులను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు గురువారం మరో గుట్టురట్టు చేశారు. నగరంలోని ఏటుకూరు రోడ్డులో వున్న కమ్మ శేషయ్య గ్రౌండ్‌లో ఎలాంటి అనుమతి లేకుండా నిల్వవుంచిన బయో ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ గోడౌన్‌లో అక్రమంగా నిల్వవుంచిన 350 లీటర్ల బయోస్టిమ్యులెంట్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటికి జీ2 అనుమతులులేవని అధికారులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు తరలించటానికి సిద్ధంగా ఉన్న బయోస్టిమ్యులెంట్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బయోల విలువ రూ.6.10 లక్షల వరకు ఉంటుందని విజిలెన్స్ అధికారులు ప్రకటించారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు నేతృత్వంలో జరిగిన ఈదాడుల్లో విజిలెన్స్ ఏవో కె.రమణ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, స్థానిక ఏవో బి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.43 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

నవరత్నాలు కాదు.. నకిలీ రత్నాలు

- రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసిన జగన్‌ను నమ్మొద్దు
- జనసేన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో బ్రహ్మారెడ్డి

దుర్గి, ఫిబ్రవరి 8 : నవరత్నాలు పేరుతో నకిలీ రత్నాలను ప్రజలకు అందించి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన దుర్మార్గుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మండలంలోని ధర్మవరంలో గురువారం జనసేన జెండా ఆవిష్కరించారు. అనంతరం దుర్గిలో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభించి బ్రహ్మారెడ్డి విలేకరులతో మాట్లాడారు. పేద ప్రజల అమాయకత్వాన్ని బలహీనతగా వినియోగించుకొని పిన్నెల్లి బ్రాండ్లతో మద్యాన్ని విచ్చలవిడిగా అంటగట్టి డబ్బులు దోచుకుంటున్నారన్నారు. వరికపూడిశెల ప్రాజెక్ట్ పెద్ద బూటకమని, కాగితంపై లెక్కలు చూపి కమీషన్ల కోసం పోరాడుతూ వరికపూడిశెలను అడ్డుకున్నారని ఆరోపించారు. ఎక్కడ చూసినా గుంతలు తప్ప అభివృద్ధి ఎక్కడ ఉందని ప్రశ్నించారు. కొండలు, గుట్టలు, చెరువులను కబ్జా చేస్తూ పిన్నెల్లి సోదరులు కోట్లకు పడగలెత్తారన్నారు. తనకు ఒక్కసారి అవకాశమిస్తే అభివృద్ధి చూపిస్తానని, వరికపూడిశెలతోపాటు బుగ్గవాగును అందుబాటులోకి తీసుకొస్తానని అన్నారు. సిద్ధం అంటూ పోస్టర్లు విడుదల చేయడం విడ్డూరంగా ఉందని, దేనికి సిద్ధం.. ఇంటికి పోవడానికా.. అవినీతి చేయడానికి అని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన మిమ్మల్ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జనసేన గుంటూరు, పల్నాడు సమన్వయకర్త గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ, జనసేన నేతలు సోదరభావంతో ఉండి నరరూప రాక్షసుడైన జగన్‌మోహన్‌రెడ్డిని సాగనంపాలన్నారు. గతంలో జనసేన నేతలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టిన దుర్మార్గుడు పీఆర్కే అన్నారు. ముందుగా ధర్మవరంలో బ్రహ్మారెడ్డి, వెంకటేశ్వరరావులకు భారీ స్వాగతం లభించింది. గ్రామంలో భారీ ర్యాలీ జరిపారు. అలాగే మండలంలోని మంగాపురం తండా, కంచరగుంట గ్రామాల్లో జనసేన జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన మాచర్ల అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాద్, జిల్లా కార్యదర్శి పులి హరి, సమన్వయకర్త బూసా రామాంజినేయులు, బీమా అమరయ్య, మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు, టౌన్ అధ్యక్షుడు రుద్రాల రవి, కొత్తా గోపి, టీడీపీ నేతలు మేకల దాసు, జానకి రామయ్య, యేచూరి శివ, సింగు నాగేశ్వరరావు, ఓర్సు కోటేశ్వరరావు, సూరె వెంకటేశ్వర్లు, మాచర్ల మదార్, కోరే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిక

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 8 : వైసీపీని అధికారంలోకి తెచ్చేందుకు తామెంతో కృషి చేసినా అధికారంలోకి వచ్చాక నేతలందరూ దళితులను దూరం పెట్టడంతో పాటు పథకాలను సైతం రద్దు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వైసీపీని వీడి టీడీపీలో చేరడం జరిగిందని గురజాల పట్టణంలోని 19, 20 వార్డులకు చెందిన 25 ఎస్సీ సామాజికవర్గ నేతలు తెలిపారు. పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో గురువారం యరపతినేని వారందరికీ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కత్తి మహేష్, పేరుపోగు రజనీకాంత్, కత్తి ఆంద్రయ్య, చింతకాయల ఆదాం, అశోక్, థామస్, ప్రసాద్, నాదెండ్ల శ్రీను, యాసారపు రత్తయ్య, దానియేలు, మరియబాబు, అశోక్, రాజేష్, కత్తి మరియబాబు, జెల్ది మరియబాబు, పాముల సన్ని, కత్తి నవదీప్, పేరుపోగు దయాకర్, మామిడి రాజ్‌కుమార్, సాగర్‌తో పాటు మరికొంతమంది పార్టీలో చేరారు. టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, అడపా శ్రీను, నేలవల్లి బొల్లయ్య, దావీదు, కత్తి ప్రసంగి, ఏసుపోగు రాంబాబు, చింతకాయల పేతురు, వంశీ, కుక్కమూడి కల్యాణ్, మరియబాబు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో యరపతినేని శ్రీనివాసరావు

తెలుగు యువత మండల కార్యదర్శిగా పాశం

మాచవరం, ఫిబ్రవరి 8 : మాచవరం మండల తెలుగు యువత కార్యదర్శిగా మల్లవోలు గ్రామానికి చెందిన పాశం మహేష్ ఎన్నికయ్యారు. మాచవరంలో గురువారం ఏర్పాటు చేసిన జయహో బీసీ సభలో మల్లవోలు గ్రామానికి చెందిన పాశం మహేష్‌ను తెలుగు యువత మండల కార్యదర్శిగా యరపతినేని శ్రీనివాసరావు నియమించారు. ఈ సందర్భంగా గరికపాటి కామేశ్వరరావు, తుమ్మలచెరువు గోపాలరావు, బేతంచర్ల రామయ్య, తుమ్మలచెరువు బ్రహ్మం, నార్ల నరసింహారావు, యరపతినేనికి, మహేష్‌కు అభినందనలు తెలిపారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఏవో

మాచవరం, ఫిబ్రవరి 8 : మండలంలోని రేగులగడ్డ, చెన్నాయపాలెం, వేమవరం, తురకపాలెంలో ఉన్న పోలింగ్ బూత్‌లను మండల వ్యవసాయ అధికారి రామమ్మ శుక్రవారం పరిశీలించారు. విద్యుత్, మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణాలు, వృద్ధులు ఎక్కేందుకు మెట్ల మార్గం సక్రమంగా వున్నాయా లేదా అని పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించడం జరుగుతుందన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేసే వారికే ఓటు

దాచేపల్లి, ఫిబ్రవరి 8 : రానున్న ఎన్నికలలో సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని ఎవరైతే అమలు చేస్తారో వారికే ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఓట్లు వేస్తారని ఉపాధ్యాయులు తెలిపారు. గురువారం నారాయణపురంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయులు ఓట్ ఫర్ ఓపీఎస్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వట్టిపు నాగేశ్వరరావు, నాగెండ్ల ఏసయ్య, పి.రాజారావు, వాసుదేవరావు, శాంతారావు, చాంద్‌బాషా, మో జేష్, సుధాకర్‌రెడ్డి, ఏడుకొండలు, జివి శ్రీనివాసరావు, మదన్‌మోహన్, సీపీఎస్ కమిటీ అధ్యక్షులు కొండలు, సాగర్‌బాబు, వెంకటేశ్వరరావు, వేణుగోపాలరావు ఉన్నారు.

జంగా ఆత్మీయ సదస్సుకు తరలివెళ్లిన బలహీనవర్గాలు



జంగా కృష్ణమూర్తి ఇంటి వద్ద బలహీనవర్గాల నాయకులు

దాచేపల్లి, ఫిబ్రవరి 8: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరుగుతున్న ఆత్మీయ సదస్సుకు గురజాల నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి బడుగు, బలహీన వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి స్వగ్రామం గామాలపాడుకి గురువారం మధ్యాహ్నం పదుల సంఖ్యలో వాహనాలలో వివిధ ప్రాంతాలకు చెందిన బీసీ నాయకులు, అభిమానులు చేరుకొని ఆయనను కలిసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన నాయకులు జంగాతో కలిసి పిడుగురాళ్లలో జరుగనున్న ఆత్మీయ సదస్సుకు తరలివెళ్లారు.

ఆటోను దగ్ధం చేసిన వ్యక్తి అరెస్టు

దాచేపల్లి, ఫిబ్రవరి 8 : మండలంలోని కేశానుపల్లిలో ఇంటిముందు ఉన్న ఆటోను దగ్ధం చేసిన సంఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం దాచేపల్లి సిఐ సురేంద్రబాబు వివరాలు వెల్లడిస్తూ ఈ నెల 2వ తేదీన అర్ధరాత్రి సమయంలో కేశానుపల్లి గ్రామానికి చెందిన షేక్ రఫీ ఆటోను దగ్ధం చేశారు. విచారణ జరుపగా అదే గ్రామానికి చెందిన వినుకొండ సురేష్‌ను అరెస్టు చేశామన్నారు. దాచేపల్లికి చెందిన ఓ మహిళతో వున్న వివాహేతర సంబంధం వల్ల బాధితుడు రఫీ ఆటోను దగ్ధం చేసినట్లుగా ప్రాథమిక విచారణలో తేలిందన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుడు మృతి

దాచేపల్లి, ఫిబ్రవరి 8 : దాచేపల్లి మండలంలోని పెదగార్లపాడు గ్రామ సమీపంలోని చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న బీహార్‌కు చెందిన కార్మికుడు శివకుమార్ ఠాకూర్ (56) నలభై అడుగుల ఎత్తు నుంచి కిందపడిపోయాడు. తీవ్రగాయాలపాలైన ఠాకూర్‌ను పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. దాచేపల్లి సీఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంతకుమించి జగన్‌కు శిక్ష

- చంద్రబాబును అక్రమంగా జైలుకు పంపారు
- అధికారం ఉందని విర్రవీగుతున్న వారికి గుణపాఠం
- జయహో బీసీ సభలో మాజీ ఎమ్మెల్యే యరపతినేని



సభలో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు తదితరులు

మాచవరం, ఫిబ్రవరి 8: మిస్టర్ సీఎం.. మీసం మెలేసి చెబుతున్నా రాజమండ్రి సెంట్రల్ జైలులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును పెట్టిన గదిలో నిన్ను పెట్టకపోతే టీడీపీ పార్టీయే కాదని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి మీసం మెలేసి సవాల్ విసిరారు. మాచవరంలోని మునుసుబు గారి కల్యాణ మండపంలో గురువారం మండలస్థాయి జయహో బీసీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ బీసీ సంఘ అధ్యక్షులు నాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. యరపతినేని మాట్లాడుతూ టీడీపీ బీసీలకు వెన్నుముక లాంటిదన్నారు. చంద్రబాబు, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్రలపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని అన్నారు. గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అధికార అహంకారానికి 11 మంది బీసీ మైనారిటీలను చంపించడమే కాకుండా అక్రమ క్వారీయింగ్ గుంతల్లో పడి 8 మంది చిన్నారులు చనిపోయారన్నారు. పిన్నెల్లి, తురకపాలెం గ్రామాలలో మేము అభివృద్ధి చేస్తే వారు అరాచకం చేసి అనేక మందిని గ్రామాలు వదిలి వెళ్లేలా చేశారని తెలిపారు. అధికారం ఉందని అహంకారంతో విర్రవీగుతున్నారని, బాబాయిని హత్య చేయించడమే కాకుండా సునీతను కూడా హత్య చేయించాలని చూస్తున్నారన్నారు. సొంత చెల్లెలిపై వైసీపీ సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడుతుంటే పట్టించుకోని దౌర్భాగ్యపు సీఎం అన్నారు. రాష్ట్రాన్ని గంజాయాంధ్రప్రదేశ్‌గా మార్చి యువతీ, యువకుల భవిష్యత్‌తో చెలగాటమాడుతున్నారని ఆవేదన చెందారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి రూ.500 కోట్లతో నరసరావుపేటలో, మరో రూ.500 కోట్లతో హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో విశాలవంతమైన బిల్డింగ్‌లు అక్రమ సంపాదనతో నిర్మించుకున్నాడని తెలిపారు.

రెండు నెలలు కష్టపడండి.. ఐదేళ్లు సేవ చేస్తా !

రానున్న రెండు నెలలు కష్టపడి పనిచేయండి....ఐదేళ్లు మీకు సేవ చేస్తానని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కార్యకర్తలకు హామీ ఇచ్చారు. నాలుగున్నర సంవత్సరాలుగా వైసీపీ నాయకులు, కార్యకర్తల అరాచకాలతో టీడీపీ కార్యకర్తలు, నాయకులు అనేక రకాల ఇబ్బందులు పడ్డారని, అంతేకాకుండా ఆర్థికంగా కూడా నష్టపోయారని తెలిపారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో గ్రామాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి నష్టపోయిన ప్రతి కార్యకర్తను, నాయకులను ఆదుకుంటానన్నారు. ఏడుసార్లు గురజాల నియోజకవర్గంలో పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చిన తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబునాయుడుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి మహిళకు సంవత్సరానికి మూడు సిలిండర్లు అందిస్తానని తెలిపారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసి 10 వేల మంది యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్నారు. నియోజకవర్గంలో లక్షా 50 వేల మందికి చంద్రన్న బీమా ప్రీమియం చెల్లిస్తానని చెప్పడంతో ఒక్కసారిగా సభలో కరతాళ ధ్వనులు మోగాయి. అదేవిధంగా హజ్‌యాత్రకు వెళ్లే వారికి తన వంతు ఆర్థిక సహాయం, ప్రార్థనలకు వెళ్లే క్రిస్టియన్‌లకు ఉచిత బస్సులు ఏర్పాటు చేస్తానని తెలిపారు. పసుపు, కుంకుమ, సీమంతాలు, షష్టిపూర్తిలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు గుంటుపల్లి నాగేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకులు వసంత సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు బడిగుంచల వెంకటేశ్వర్లు, బీసీ నాయకులు తురకా వీరస్వామి, అక్కినపల్లి బాలయ్య, యారాసి వెంకటరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, నలబోతుల శ్రీను, ముశ్యం శ్రీనివాసరావు, బడుగుల శ్రీను, గొల్లపల్లి అంజి, గోళ్ల గంగాధర్, పాశం గురవయ్య, మద్దిరాల రామారావు, మంగళగిరి శ్రీను, నంద్యాల శివ, రాధాకృష్ణ, కె రామయ్య, రామారావు, టైలర్ నాగార్జున, ఎ కొండలు, తదితరులు పాల్గొన్నారు.

అప్పి శ్రీనును పరామర్శించిన వెంకట్రామిరెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 8 : పట్టణానికి చెందిన దేవనపల్లి శ్రీనివాసరావు (అప్పి శ్రీను) అనారోగ్య కారణాలతో బాధపడుతూ ఇటీవల చికిత్స చేయించుకొని గృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి గురువారం శ్రీను గృహానికి చేరుకొని పరామర్శించారు. అలాగే పట్టణంలోని 15వ వార్డు కౌన్సిలర్ కొమెర చెన్నకేశవులు ఇటీవల మరణించడంతో చెన్నకేశవులు గృహానికి చేరుకొని చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన కుమారుడు చందుగౌడ్‌ను పరామర్శించారు.

వ్యాపార సంస్థలకు లేబర్ లైసెన్సు తప్పనిసరి

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 8 : వ్యాపార సంస్థలకు లేబర్ లైసెన్సు తప్పనిసరి అని లేబర్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ధనలక్ష్మి అన్నారు. పట్టణంలోని సహాయ కార్మిక అధికారి కార్యాలయంలో స్థానిక వ్యాపార సంస్థల యజమానులతో ఆమె సమావేశమయ్యారు. ఈనెలాఖరు కల్లా లైసెన్సు తీసుకోకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సహాయ కార్మిక అధికారి కిలారు విష్ణు, జూనియర్ సహాయకులు బాలునాయక్ పాల్గొన్నారు.

కేబీ ప్రసాద్ వితరణ హర్షణీయం

మాచర్ల, ఫిబ్రవరి 8 : పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో గల మూడు సెంట్ల స్థలంతోపాటు అందులోని గదిని బాబు ప్రసాద్ సీపీఎంకి వితరణగా అందించడం హర్షణీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం నాయకులు అంజనేయులు నాయక్, బండ్ల మహేష్, వెంకటరత్నం, బత్తుల మహేష్, సురేష్ పాల్గొన్నారు.

ఆహార సంరక్షణపై అవగాహన

వెల్దుర్తి, ఫిబ్రవరి 8 : వెల్దుర్తిలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం గంగాభవాని ఆధ్వర్యాన ఆహార సంరక్షణపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు నాణ్యమైన ఆహారంపై అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమన్నారు. అనంతరం స్థానిక బెంగళూరు అయ్యంగారు బేకరిలో కేకు, బ్రెడ్ తయారీపై విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ సౌభాగ్యమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

సత్రశాలలో చెక్ పోస్టు ఏర్పాటు

రెంటచింతల, ఫిబ్రవరి 8 : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సత్రశాలలోని టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు మెయిన్‌గేట్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి చెప్పారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతుందని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మద్యం, నగదు తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

మోటార్ అపహరణ

రెంటచింతల, ఫిబ్రవరి 8 : మేజర్ పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణవీధిలోని చేద బావిపై అమర్చిన విద్యుత్ మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు బాధితురాలు యామర్తి శివమ్మ చెప్పారు. దీని విలువ రూ.10 వేలు దాకా ఉంటుందన్నారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో రాత్రి వేళ పోలీసుల గస్తీ ముమ్మరం చేయాలని పలువురు కోరుతున్నారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి

మాచర్ల, ఫిబ్రవరి 8: వాహన చోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని రూరల్ ఎస్ఐ కుర్రి రాజశేఖర్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని రాయవరం జంక్షన్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్సు కలిగి ఉండాలని అన్నారు.

శ్రీసిమెంట్ ఫ్యాక్టరీ వద్ద గ్రామస్తుల ఆందోళన

కారంపూడి, ఫిబ్రవరి 8 : మండలంలోని ఇనుపరాజుపల్లిలో గల శ్రీసిమెంట్ ఫ్యాక్టరీ వద్ద గురువారం గ్రామస్థులు ఆందోళనకు దిగారు. గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించి ఆరు ఎకరాల భూమి ఉందని, గతంలో ఈ భూమికి వేలంపాటలు నిర్వహించి దాని ద్వారా వచ్చే ఆదాయంతో ఆలయంలో దూప, దీప, నైవేద్యాలు నడిచేవని అన్నారు. అయితే ఫ్యాక్టరీ సమీపంలోనే ఉండడంతో ఈ భూమి వేలంపాటకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆలయాన్ని మూసివేయాల్సి వచ్చిందని వాపోయారు. ఫ్యాక్టరీ యాజమాన్యం ఆలయం దూప, దీప, నైవేద్యాలకు, పూజారి వేతనానికి అయ్యే ఖర్చును భరించి ఆలయాన్ని తెరిపించాలని కోరారు.

స్వామి వారికి ప్రత్యేక పూజలు

నకరికల్లు, ఫిబ్రవరి 8 : మండలంలోని నరసింగపాడులో ఉన్న అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో, గంగా అన్నపూర్ణ సమేత మరకత లింగ చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో మాస శివరాత్రి ప్రదోషకాల సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఆటో, బస్సు ఢీ : పది మందికి గాయాలు

అమరావతి, ఫిబ్రవరి 8 : విజయవాడ రోడ్డులో పెదమద్దూరు నుంచి కూలీలతో అమరావతివైపు వస్తున్న ఆటో, విజయవాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆటో రహదారి పక్కన ఉన్న డొంకలోకి పడిపోయింది. దీంతో ఆటోలో ఉన్న పదిమంది కూలీలకు గాయాలు కాగా వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దొంగ ఓట్ల నమోదుపై చర్యలు తీసుకోవాలి

బెల్లంకొండ, ఫిబ్రవరి 8 : దొంగ ఓట్లు నమోదు చేసిన వారి పై చట్ట రీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బెల్లంకొండ మండల టీడీపీ నాయకులు ఈఆర్‌వోకు ఫిర్యాదు చేశారు. పెదకూరపాడు ఎన్నికల అధికారి ఈఆర్‌వో నాగజ్యోతికి గురువారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉద్దేశ పూర్వకంగానే అధికార పార్టీ వారు కొంత మంది టీడీపీ, జనసేన పార్టీ సానుభూతిపరుల ఓట్లను తొలగించే ప్రక్రియ చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, వీర్ల వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరులో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ

క్రోసూరు, ఫిబ్రవరి 8 : క్రోసూరులోని ముదిరాజుల కాలనీలో గురువారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంతో పాటు మీ ఇంటికి మీ కొమ్మాలపాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్‌లు కాండ్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుద్దుల యోహాన్, మన్నెం శ్రీనివాసరావు, షేక్ సలాం, అనుమాల పూర్ణ, అనుమల రామిరెడ్డి, ఊరే రోశయ్య, అనుముల కోటిరెడ్డి, ఆది శ్రీను, మల్లాల రామాంజనేయులు, గోగిశెట్టి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేట, ఫిబ్రవరి 8 : ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్ ప్లాన్ నిధులను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని టీడీపీ మండల నాయకులు అన్నారు. అచ్చంపేటలోని 58వ బూత్‌లో గురువారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, బత్తుల శ్రీనివాసరావు, సందెపోగు సామేలు, వెనిగండ్ల కోటయ్య, తాళ్ళూరి సుబ్బారావు, రేపూడి తోమాస్, రాయిడి సాంబశివుడు, యడ్లపల్లి బుచ్చిబాబు, నెల్లూరి వెంకటయ్య పాల్గొన్నారు.

నమ్మిన వారిని నట్టేట ముంచిన సీఎం జగన్

పెదకూరపాడు, ఫిబ్రవరి 8 : నమ్మిన వారిని నట్టేట ముంచిన గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ ఛైర్మన్ వడ్లమూడి అప్పారావు, టీడీపీ శాలివాహన సంఘ రాష్ట్ర నాయకులు మోదుగుల చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కన్నెగండ్లలో గురువారం మన ఇంటికి మన కొమ్మాలపాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రణాళికను అమలు చేసి వైసీపీని ఇంటికి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, టీడీపీ మండల నేతలు మద్దినేని వెంకట సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర నాయకులు గంగినేని లీలావతి, జిల్లా నాయకులు షేక్ ముతాంజ్, నియోజకవర్గ నాయకులు నెల్లూరి మల్లికార్జున్, మక్కెన సాగర్, మండల నేతలు షేక్ దిలీప్, పఠాన్ షబ్బీర్, భావన రాంబాబు, కోరంపల్లి వెంకట్రామయ్య, కోరంపల్లి నరేంద్ర, విదుశ్ళపల్లి వీరయ్య, దండు శ్రీను, కె.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల అరెస్టు అప్రజాస్వామికం

అమరావతి, ఫిబ్రవరి 8 :తమ సమస్యలు పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని అక్రమ అరెస్టులతో అడ్డుకోవడం అప్రజాస్వామికమని సీఐటీయూ నాయకుడు బి.సూరిబాబు అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశా కార్యకర్తలకు వేతనాన్ని పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

క్రోసూరు ఎస్ఐగా మహమ్మద్ షఫీ

క్రోసూరు, ఫిబ్రవరి 8 : క్రోసూరు ఎస్ఐగా మహమ్మద్ షఫీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు నుంచి సీసీఎస్ ఎస్ఐగా పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన నరసింహా అమరావతి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన మహమ్మద్ షఫీ జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్ఐ మహమ్మద్ షఫీని పలు రాజకీయ పార్టీల నాయకులు కలసి అభినందనలు తెలిపారు.

అనంత రామయ్య మాస్టారు మృతి

క్రోసూరు, ఫిబ్రవరి 8 : విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పాతూరి అనంత రామయ్య(80) గురువారం మృతి చెందారు. ఆయన క్రోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా సుదీర్ఘ కాలం పని చేశారు.ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

కోనూరులో లేగ దూడల ప్రదర్శన

అచ్చంపేట, ఫిబ్రవరి 8 : మండలంలోని కోనూరులో గురువారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో లేగ దూడల అందాల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 57 లేగ దూడలు పాల్గొన్నాయి. దాసరి సాలీగ్రామ్ దూడకు మొదటి బహుమతి, మచ్చ మార్కండేయులు దూడకు రెండవ బహుమతి, గుంటుపల్లి ఆంజనేయులు దూడకు మూడవ బహుమతి లభించాయి. కార్యక్రమంలో వీడీ పీ.రామారావు, డాక్టర్ సీహెచ్ నర్సింహులు, డాక్టర్ కే.శివ సారథి బాబు, డాక్టర్ పీ.స్వాతిదేవి, సువర్ణ కుమారి, రామారావు, రైతులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో పది మందికి గాయాలు

నకరికల్లు, ఫిబ్రవరి 8 : మండలంలోని కుంకలగుంట గ్రామంలో బుధవారం రాత్రి, గురువారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. ఈ పిచ్చి కుక్క దాడిలో పది మంది గాయపడ్డారు. గ్రామంలో వేర్వేరు పనుల మీద వెళ్తున్న వారిపై వెంట బడి కరవటం జరిగింది.



కన్నా లక్ష్మీనారాయణకు సమస్యలు వివరిస్తున్న మురళీ నగర్ మహిళ

రోడ్లు వేస్తామని పత్తా లేకుండాపోయారు

- కన్నా లక్ష్మీనారాయణ వద్ద మురళీనగర్ మహిళల ఆవేదన

సత్తెనపల్లి, ఫిబ్రవరి 8 : మంత్రి అంబటి రాంబాబు, ఆయన తమ్ముడు మురళీ ఎన్నికల ముందు నందిగామ పంచాయతీ పరిధిలోని మురళీనగర్‌లో రోడ్లు వేస్తామని, విద్యుత్ స్తంభాలు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పి మాట తప్పారని మురళీనగర్‌కు చెందిన షఖీల అనే మహిళ ఆరోపించారు. గురువారం రాత్రి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన అనంతరం నేటి వరకు మంత్రి అంబటి రాంబాబు మురళీనగర్ వైపు కన్నెత్తి చూడలేదన్నారు. రోడ్లు, తాగునీటి సమస్యతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆమె కన్నాకు తెలిపారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే మురళీనగర్‌లో సమస్యలను పరిష్కరిస్తామని కన్నా తెలిపారు. కార్యక్రమంలో కన్నా పాటు టీడీపీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, నాయకులు ఆళ్ళ సాంబయ్య, కోమటినేని శ్రీనివాసరావు, ఎలినేడి లక్ష్మీ తులసీ తదితరులు ఉన్నారు.

మల్లయ్య కుటుంబ సభ్యులకు అండగా ఉంటా : కన్నా

నకరికల్లు, ఫిబ్రవరి 8 : నకరికల్లులో బెల్లంకొండ మల్లయ్య చిత్రపటానికి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని తెలిపారు. నరసింగపాడు గ్రామానికి చెందిన పుల్లంశెట్టి భాను నరసరావుపేటలోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా కన్నా పరామర్శించారు. కుంకలగుంటకి చెందిన రాము నాయక్ ప్రమాదంలో గాయపడి గుంటూరులో చికిత్స పొందుతుండగా కన్నా పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య, నాదెండ్ల సత్యనారాయణ, డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, దూదేకుల హుస్సేన్‌బీ, తాండ్ర వెంగళరావు, షేక్ అలీ బాషా, తిరుమలశెట్టి వెంకటరావు, మర్రి వేముల సిద్దయ్య, ఢీకొండ మహానంది, పూల మస్తాన్‌రావు, బత్తిన శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి మురళీకృష్ణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 8 : నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులను మెరుగుపరచాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి మురళీకృష్ణ సూచించారు. ఆర్డీవో కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలకు, సెక్టార్ ఆఫీసర్లకు వివిధ అంశాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ అధికారులు అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలన్నారు. ఓటర్ల నమోదుకు సంబంధించిన ఓటర్ల జాబితాలో సవరణలను పారదర్శకంగా చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చూడాలన్నారు. ప్రీ పోల్, పోస్టు పోల్ విధులు బాధ్యతల గురించి వివరించారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని అసిస్టెంట్ ఎన్నికల అధికారులు, 31 మంది సెక్టార్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

దళితులను నిలువునా ముంచిన సీఎం జగన్ : అంకాళ్ల

రాజుపాలెం, ఫిబ్రవరి 8 : రాష్ట్రంలోని దళితులను సీఎం జగన్ నిలువునా ముంచాడని టీడీపీ పార్లమెంటు కమిటీ కార్యదర్శి అంకాళ్ల ప్రభుదాసు ఆరోపించారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అదేశాల మేరకు గురువారం మండలంలోని దేవరంపాడులో దళిత చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు. దళిత నాయకులు వాసా వెంకటేశ్వర్లు, శనగపూల వెంకయ్య, లంకా వీరయ్య, కోట జోసఫ్, తెలగనేని వెంకటేశ్వర్లు, పత్తిపాటి వెంకయ్య, నందగోపాలరావు, గోదా ఆదం, చింతపల్లి చెన్నయ్య ఉన్నారు.

నోటీసులు అందజేత

సత్తెనపల్లి, ఫిబ్రవరి 8 : పట్టణంలోని రఘురామ్ నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తున్న శిఖాకొలను వెంకట రమణకు నోటీసులు జారీ చేసినట్టు టౌన్ ప్లానింగ్ అధికారి రాఘవరావు గురువారం విలేకరులకు తెలిపారు. పురపాలక సంఘంలో అనుమతులు తీసుకున్న వాటికి విరుద్ధంగా ఆయన నిర్మాణాలు చేస్తున్నారని, వెంటనే నిర్మాణాలు నిలుపుదల చేయాలని నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు.

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న మోదీ ప్రభుత్వం : సీపీఎం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 8 : ఒకే దేశం, ఒకే చట్టం పేరుతో మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వీ కృష్ణయ్య అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం సీపీఎం జిల్లా శాఖ కార్యదర్శుల సమావేశం జరిగింది. కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న దేశ వ్యాప్తంగా గ్రామీణ బంద్‌లో కార్మికులు, కర్షకులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ ఆంజనేయ నాయక్, గుంటూరు విజయకుమార్, గోపాలరావు, ఏ.లక్ష్మీశ్వరరరెడ్డి, రాధాకృష్ణ, రవిబాబు, పెండాల మల్లేశ్వరి, గుంటూరు మల్లేశ్వరి, గద్దె ఉమాశ్రీ, ధరణికోట విమల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం : సీపీఐ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 8 : వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు బీజేపీ అన్ని విధాలా సహకరిస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నరిచేటి వేణుగోపాల్ అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీజేపీ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు తలొగ్గి ఏపీ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతుందన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని కేంద్రం వద్ద తాకట్టు పెట్టే ఏ చర్యలను ప్రజలు క్షమించరన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

రాజుపాలెం, ఫిబ్రవరి 8 : మండలంలోని రాజుపాలెంలో ఉన్న మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నులిపురుగుల నివారణ మాత్రలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పంపిణీ చేశారు. డాక్టర్ కృష్ణకుమార్ మాట్లాడుతూ మండలంలో 2 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాలలోపు మొత్తం 8750 మంది పిల్లలు ఉన్నారని, వారందరికీ శుక్రవారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లికార్జునశర్మ, హెల్త్ సూపర్‌వైజర్ జీవనరావు, హెల్త్ అసిస్టెంట్ రాజు, ఆరోగ్య కార్యకర్తలు తిరుపతమ్మ, రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.

చేజర్లలో కొనసాగుతున్న రాజ శ్యామల యాగం

నకరికల్లు, ఫిబ్రవరి 8 : చేజర్ల కపోతేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో సత్తెనపల్లి నియోజక వర్గ జనసేన ఇన్‌చార్జ్ బొర్రా వెంకట అప్పారావు చేస్తున్న రాజశ్యామల యాగం గురువారం నాల్గవ రోజుకు చేరుకుంది. జనసేన, టీడీపీ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ బొర్రా వెంకట అప్పారావు ఈ యాగాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ప్రజలు సుఖ సంతోషాలతో పాడి పంటలతో జీవనం గడపాలని ఆకాంక్షిస్తూ మంచి పాలన రావాలని ఈ యాగాన్ని నిర్వహించ తలపెట్టినట్టు వెంకట అప్పారావు తెలిపారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 8 : రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో సత్తెనపల్లి పట్టణ సీఐ ప్రభాకరరావు ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఎస్ఐలు సంధ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● అమరావతి, ఫిబ్రవరి 8 : భద్రతా వారోత్సవాలలో భాగంగా అమరావతి పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటోడ్రైవర్‌లతో కలసి గురువారం సాయంత్రం భద్రతా ర్యాలీ నిర్వహించారు. ఎస్‌హెచ్‌ఓ బ్రహ్మం ఆటో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

అవినీతికి చిరునామా ఎమ్మెల్యే గోపిరెడ్డి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 8: అవినీతికి, దుర్మార్గానికి చిరునామా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో హత్యారాజకీయాలకు ప్రోత్సాహం ఇచ్చింది ఎమ్మెల్యే అన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలోని వరవకట్టలో పెద్దబాజీని, మసీదు గొడవలలో ఇబ్రహీమ్ అనే వృద్ధుడిని, అలవాలలో వెన్నా బాలకోటరెడ్డిని చంపింది ఎమ్మెల్యే అనుచరులేనని ఆరోపించారు. వీటిపై సమాధానం చెప్పాల్సింది కూడా ఎమ్మెల్యేనే అన్నారు. తురిమెళ్ళకు చెందిన ఎస్సీ సామాజికవర్గానికి చెందిన కూలీ శ్రీనివాసరావుపై హత్యాయత్నం జరిగిందన్నారు. ఎమ్మెల్యే చేసిన తప్పులే ఓడిస్తాయని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మన్నాన్ షరీఫ్, యువ నాయుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.



వేల్పూరులో డెంగీ బాధితులను పరామర్శిస్తున్న జీవీ ఆంజనేయులు

డెంగీ బాధితులకు మాజీ ఎమ్మెల్యే జీవీ పరామర్శ

వేల్పూరు (శావల్యాపురం) ఫిబ్రవరి 8: మండలంలోని వేల్పూరులో నెలరోజులుగా డెంగీ బారినపడి చికిత్సలు పొందుతున్న బాధితులను పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గురువారం పరామర్శించారు. గ్రామంలోని పరిస్థితులను జడ్పీటీసీ పారా హైమావతి ద్వారా తెలుసుకొన్న జీవీ వేల్పూరుకు చేరుకొని బాధితుల ఇళ్ళకు వెళ్ళి వారిని పరామర్శించారు. బాధిత కుటుంబాలకు తామంతా అండగా ఉంటామని జీవీ వారిలో మనోధైర్యాన్ని నింపారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు బొల్లా పేరయ్య, దొడ్డా ఏడుకొండలు, సాదినేని కృష్ణమూర్తి, యేగినాటి తిరుపతిరావు, లింగా శ్రీనివాసరావు, మారాసు రామయ్య, పావులూరి శ్రీనివాసరావు, సూరాబత్తుని శ్రీరాములు, అంజి, మారాసు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావును పరామర్శించిన జీవీ ఆంజనేయులు

రొంపిచర్ల, ఫిబ్రవరి 8: మండలంలోని తురుమెళ్ళ గ్రామానికి చెందిన గొల్లపూడి శ్రీనివాసరావుపై వైసీపీకి చెందిన వారు కొద్ది రోజుల క్రితం దాడిచేసి గాయపరిచారు. కాగా నరసరావుపేటలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావును జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు గురువారం పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ ఇన్‌చార్జ్ అరవింద బాబు ఉన్నారు.

నారా భువనేశ్వరిని కలసిన గోనుగుంట్ల కోటేశ్వరరావు

రొంపిచర్ల, ఫిబ్రవరి 8 : మండలంలోని రొంపిచర్లకు చెందిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు నారా భువనేశ్వరిని గురువారం మందడంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు. అన్నవరం గ్రామంలో ఈ నెల 6వ తేదీన ఆమె ఇరు కుటుంబాలను పరామర్శించి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను కలసి టీడీపీ పార్టీ నియోజకవర్గ పరిస్థితుల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బడ్డీ కొట్టు దగ్ధం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 8: మండలంలోని ఇస్సపాలెంలో విద్యుత్ వైరు తెగి పడి ఓ బడ్డీ బంకు దగ్ధమైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని వడ్డెర పాలెంకు చెందిన జీ మంగమ్మ బడ్డీ బంకు పెట్టుకొని జీవిస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం బంకు పైనుంచి ఏర్పాటుచేసిన సర్వీస్ వైరు తెగిపోవటంతో బంకు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.50వేలు ఆస్తి నష్టం సంభవించినట్టు అగ్నిమాపక శాఖ సిబ్బంది తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే సిబ్బంది ఘటనా స్థలికి వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు

పది లీటర్ల నాటు సారా స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 8: నకరికల్లు మండలం చేజర్ల తండాలో పది లీటర్ల నాటు సారాను గురువారం స్వాధీనం చేసుకున్నట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార గురువారం తెలిపారు. నిందితుడు బాణావత్ రామకృష్ణ నాయక్‌ను అరెస్టు చేసినట్లు ఆమె తెలిపారు.

13వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా మల్లారెడ్డి



నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 8: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది దేశిరెడ్డి మల్లారెడ్డిని స్థానిక 13వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. ఈ మేరకు ఆయన గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2010, 2013 సంవత్సరాల్లో నరసరావుపేట 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఏపీపీగా సేవలు అందించారు. మరలా 2024లో ఆయనను ఏపీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

ప్రకృతి వ్యవసాయ పంటలకు మార్కెట్ సదుపాయం

● రాష్ట్ర రైతు సాధికార సంస్థ మార్కెటింగ్ మేనేజర్ బీజీదేవ్

ఈపూరు, ఫిబ్రవరి 8: ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన పంటలను విక్రయించుకునేందుకు ప్రత్యేక మార్కెట్‌ను ఏర్పాటుచేసి 10శాతం ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేయడం జరుగుతుందని రాష్ట్ర సాధికార సంస్థ మార్కెటింగ్ మేనేజర్ బీజీదేవ్ అన్నాడు. ఈపూరు మండలంలో ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగు చేస్తున్న మిరప, వరి పంటలను గురువారం సాయంత్రం అధికారుల బృందం పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ అమలకుమారి, డైరెక్టర్ ఇన్వెస్ట్‌మెంట్ సిద్ధార్థ శ్రీకాంత్, జిల్లాఎన్ఎఫ్ఎస్ సైదయ్య, సౌజన్య మోడల్ మేకర్స్ భాస్కరరావు, ప్రకాష్‌రావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో రక్తకణాలు లెక్కించే మిషన్ ప్రారంభం



సీబీసీ మిషన్‌ను ప్రారంభిస్తున్న వైద్యాధికారి రాధాకృష్ణన్

శావల్యాపురం, ఫిబ్రవరి 8: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తకణాలు లెక్కించే అధునాతన సాంకేతిక పరికరాన్ని వైద్యాధికారి మాన్యం రాధాకృష్ణన్ గురువారం ప్రారంభించారు. వైద్యాధికారి మాట్లాడుతూ పీహెచ్‌సీలలో అన్ని రకాల వైద్య సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చి పేదలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తుందని, సుమారు రూ.3లక్షలు విలువైన రక్తకణాలు లెక్కించే పరికరాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. రక్తకణాల పరీక్షకు ప్రైవేటు ఆసుపత్రులలో రూ.400వరకు వసూలు చేస్తున్నారని, పీహెచ్‌సీలలో రోగులకు దాన్ని ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, కిడ్నీ పరీక్షలు ఇప్పటికే పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయని, డెంగీ జ్వరాలతో బాధపడుతూ నీరసంగా ఉన్న రోగులకు రక్తకణాలు లెక్కించి తద్వారా చికిత్సలు అందించేందుకు సీబీసీ పరికరం ఎంతో దోహదపడుతుందన్నారు. ఆయనతో స్టాఫ్‌నర్సు లక్ష్మీప్రసన్న, ల్యాబ్‌టెక్నీషియన్లు సీతారామయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు పేటలో వైద్య శిబిరం

వినుకొండ, ఫిబ్రవరి 8: పట్టణంలోని 11వ వార్డు రైలుపేటలో మక్కెన మహేష్ ఆధ్వర్యంలో హెల్ప్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. మక్కెన మహేష్ మిత్రబృందం సభ్యులు భవిష్యత్‌లో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో గుంటకల ప్రసాద్, గుత్తా శ్రీకాంత్, దావులూరి మునెయ్య, నాగూర్, మక్కెన యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పేద వితంతువులకు నిత్యావసరాల పంపిణీ

వినుకొండ, ఫిబ్రవరి 8: పట్టణంలోని మిర్చియార్డు సమీపంలోని వినుకొండ చర్చ్ ఆఫ్ క్రైస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో పేద వితంతువులకు గురువారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఈవో ఎండీ రాజు మాట్లాడుతూ వివిధ గ్రామాల్లోని పేద వితంతువులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎం.రమేష్‌బాబు, ఎం.ప్రవళిక, ఎన్.బ్రహ్మయ్య, టి.వెంకటకృష్ణ, కిరణ్, జంగా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులు వెళ్తున్న బస్సుకి పచ్చజెండా ఊపుతున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, పక్కన ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 8: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు గురువారం విశాఖకు బయల్దేరి వెళ్లారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ క్రీడాకారులు వెళ్తున్న బస్సుకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. జిల్లా స్థాయిలో ఐదు క్రీడాంశాల్లో ఎంపికైన పది టీంలకు సంబంధించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, వాలీబాల్ కోచ్ శ్రీనివాస్ యాదవ్‌లు పాల్గొన్నారు.

పార్టీల ప్రతినిధులతో ఈఆర్‌వో సమావేశం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 8: వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో ఓటరు నమోదు అధికారి బీ నారదముని గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణలకు సంబంధించి ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా టీడీపీకి చెందిన ఎం.మల్లిబాబు, అజార్‌లు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మృతిచెందిన వారి పేర్లను ఇంకా తొలగించలేదని ఈఆర్‌వో దృష్టికి తీసుకువచ్చారు. తాము ఎనిమిది బూత్‌లను పరిశీలించగా మృతి చెందిన 151మందికి ఓట్లు జాబితాలో కన్పించాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని గ్రామాల్లో పదుల సంఖ్యలో మృతులు ఉంటే ఒక్కొక్క ఓటు మాత్రమే తొలగించినట్టు పేర్కొన్నారు. తక్షణం వీటిపై దృష్టి సారించాలని వారు కోరారు.

వైసీపీ, బీఎస్పీ, జనసేన, సీపీఐ, బీజేపీలకు చెందిన ప్రతినిధులతో పాటు నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

కరాటే దుస్తులకు సుబ్బరాయగుప్తా వితరణ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 8: నరసరావుపేట పట్టణంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఉజ్వల భారతి మహిళాశక్తిసేవా సంఘం ఆధ్వర్యంలో బాలికలకు గురువారం ఉచిత కరాటే శిక్షణ నిర్వహిస్తున్నారు. 150 మంది విద్యార్థినులకు కరాటేలో శిక్షణ నిర్వహిస్తున్నారు. కరాటే నేర్చుకునే విద్యార్థినులకు కరాటే దుస్తుల కోసం మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త రూ.25వేలు నగదును స్కూల్స్ ప్రిన్సిపాల్ ప్రమీలరాణి, కరాటే మాస్టర్ చైతన్యదీప్తికి అందజేశారు. ఈ సందర్భంగా నాగసరపు సుబ్బరాయగుప్తా మాట్లాడుతూ అపాయ సమయాలలో ఎవరికోసం ఎదురుచూసే అవసరం లేకుండా కరాటే విద్యా ఉపయోగపడుతుందన్నారు. మహిళలు అదనంగా నేర్చుకునే విద్యలో మొదటిది కరాటే అన్నారు. కస్తూర్బా స్కూల్‌లో చదువుతున్న మహిళలకు సాయం చేస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైలులో అక్రమ మద్యం స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 8: హుబ్లీ-విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైల్లో గురువారం ఉదయం 11:30 గంటల సమయంలో స్టేషన్‌లో ఆగి ఉన్న సమయంలో తనిఖీ నిర్వహించారు. ఈ 26 సీసాల కర్నాటక మిలటరీకి చెందిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు నరసరావుపేట రైల్వే ఎస్ఐ గురువారం తెలిపారు. నిందితుడు క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామానికి చెందిన షేక్ బెల్లంకొండ ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఆయన తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం సీసాల విలువ రూ 85వేల మేర ఉంటుందని ఆయన తెలిపారు.

నిరుద్యోగుల్ని మోసం చేశారు: డాక్టర్ వెంకటేశ్వరరావు,

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 8: వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగుల్ని మోసం చేశారు అనడానికి నిదర్శనం ఎన్నికల డీఎస్సీనే అని టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో అన్నారు. రాజధాని అమరావతి కోసం 34వేల ఎకరాలు ఇచ్చిన రైతులను జగన్‌మోహన్‌రెడ్డి మోసంచేశారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో సంపద సృష్టిస్తామని అన్నారు. జగన్‌రెడ్డి ఇచ్చే ప్రతి పథకాన్ని రెండింతలు పెంచి కొనసాగిస్తూనే ఉంటామని, ఏడాదికి మూడు సిలిండర్లు కూడా ఉచితంగా ఇస్తారని చెప్పారు. మద్యపాన నిషేధం అని చెప్పి ఈరోజు అదే మద్యాన్ని తాకట్టు పెట్టి ప్రభుత్వాన్ని నడుపుతున్నారని విమర్శించారు. రాబోయే టీడీపీ ప్రభుత్వంలో రాజధాని అభివృద్ధి చేస్తూనే ఈ పథకాలన్నీ అందిస్తూ రాష్ట్ర సంపాదన పెంచడం జరుగుతుందన్నారు.

యువతి అదృశ్యం

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 8: పట్టణంలోని ప్రకాష్ నగర్‌కు చెందిన 21 సంవత్సరాల యువతి ఈ నెల 1 నుంచి కన్పించటం లేదని మొదటి పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. యువతికి తల్లిదండ్రులు లేరని, ఆమె అమ్మమ్మ వద్ద ఆమె అన్నతో కలసి ఉంటుందని తెలిపారు. ఈ నెల 1న టిఫెన్ కోసం అని బయటకు వచ్చి మరలా ఇంటికి వెళ్ళలేదని, ఈ మేరకు స్వరూపరాణి అన్న ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు నరసరావుపేట మొదటి పట్టణ సీఐ, సెల్: 9440796224, ఎస్ఐ 8885401879కు తెలపాలని ఆయన కోరారు.

డ్వాక్రా సంఘాలకు ఆసరా చెక్కులు పంపిణీ

ఈపూరు, ఫిబ్రవరి 8: మహిళా సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఈపూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం నాలుగవ విడత ఆసరా చెక్కులను పొదుపు సంఘాల సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. మండలంలో 778 డ్వాక్రా సంఘాలకు రూ6.15 కోట్లు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తుర్లపాటి చౌడయ్య, శాఖమూరి బుచ్చయ్య, గోనుగుంట్ల హనుమయ్య, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరు వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ బొల్లా రాధాకృష్ణ, దుడ్డుగోలు జానయ్య కొండవర్రు నాగేశ్వరరావు, ఏపీఎం రంగారెడ్డి, సీసీలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ టీచర్‌కు వంటసామగ్రి అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం సభ్యులు

అంగన్‌వాడీ కేంద్రానికి వంటసామగ్రి వితరణ

వినుకొండటౌన్, ఫిబ్రవరి 8: విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం సభ్యులు పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన కుక్కర్, పప్పు కుక్కర్ అందజేశారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సంఘం సభ్యుల సహకారంతో రానున్న రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రామలింగేశ్వరరావు, నారాయణ, సుందరరావు, సుబ్బయ్యశర్మ, నాగేంద్రుడు, రాము, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 8: టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని చీకటీగలపాలెం అడ్డరోడ్డులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే... వినుకొండ నుంచి మార్కాపురం వైపు వెళ్తున్న ఓ టిప్పర్ జడ్డావారిపాలెం నుంచి వినుకొండకు ద్విచక్రవాహనంపై వస్తున్న ఉట్టిగంపల నాగేశ్వరరావు, గాలెమ్మలను ఢీకొంది. ప్రమాదంలో నాగేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందగా గాలెమ్మకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని గాలెమ్మను వైద్యశాలకు తరలించగా, నాగేశ్వరరావు మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సాంబశివరావు తెలిపారు.

డీఈవోని కలసిన శావల్యాపురం జడ్పీ పాఠశాల సిబ్బంది

శావల్యాపురం, ఫిబ్రవరి 8: నర్సరావుపేటలోని డీఈవో కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఈవో మేడా వెంకటేశ్వర్లును శావల్యాపురం జడ్పీ పాఠశాల సిబ్బంది గురువారం కలిసి ఘనంగా సత్కరించారు. శావల్యాపురం జడ్పీ పాఠశాలలో క్రీడామైదానం అభివృద్ధికి ప్రభుత్వం రూ.లక్ష నిధులు మంజూరు చేసిందని, అభివృద్ధి పనులను ప్రారంభించమని డీఈవో హెచ్ఎం విజయలక్ష్మికి తెలిపారు. రానున్న పది పరీక్షలలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. హెచ్ఎంతో సీనియర్ ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, రికార్డు అసిస్టెంట్ కొడాలి శ్రీకాంత్ పాల్గొన్నారు.

రికవరీ ఏజెంట్లు చట్ట పరిధిలో వ్యవహరించాలి

● జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు పిల్లి యజ్ఞనారాయణ

చిలకలూరిపేట, ఫిబ్రవరి 8: లోన్ రికవరీ ఏజెంట్లు చట్ట పరిధిలో వ్యవహరించాలని, లేకుంటే తీవ్ర చర్యలు తప్పవని పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు పిల్లి యజ్ఞనారాయణ గురువారం అన్నారు. పలు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల్లో పనిచేస్తున్న రికవరీ ఏజెంట్లు రుణ గ్రహీతలపై దాడులు చేయటం, వ్యక్తిగత దూషణ చేయటం, బెదిరించటం ఈ పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం రికవరీ ఏజెంట్లు అలాచేస్తే వ్యక్తిగతంగా కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. అటువంటి పరిస్థితుల్లో ఫైనాన్స్ సంస్థలు కూడా వారికి అండగా నిలబడవని ఆయన పేర్కొన్నారు. రికవరీ ఏజెంట్ల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రుల్లో వీ వెంకట్రామయ్యను వ్యక్తిని ఆయన పరామర్శించారు. ఆయన వెంట కన్స్యూమర్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరం జిల్లా కార్యదర్శి మురికిపూడి ప్రసాదు ఉన్నారు.

మార్చి 8వ వరకు న్యాయ విధులకు గైర్హాజరు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 8: న్యాయవాదులు మార్చి నెల 8వ తేదీ వరకు విధులకు గైర్హాజరు కానున్నట్టు నరసరావుపేట న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేరదమెట్ల నాగేశ్వరరావు గురువారం తెలిపారు. భూహక్కుల చట్టాన్ని రద్దుచేయాలని రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు విధులకు గైర్హాజరవుతున్నారు. గురువారం గుంటూరులో జరిగిన బార్ ఫెడరేషన్ తీర్మానం మేరకు మార్చి 8వ తేదీ వరకు విధులకు గైర్హాజరు కానున్నట్టు ఆయన తెలిపారు.

12మంది కృష్ణవేణి విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 8: స్థానిక కృష్ణవేణి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం హైదరాబాద్‌కు చెందిన ఐనస్ టెక్నాలజీస్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించిందని కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. రాత పరీక్షా, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి 12మంది విద్యార్థులకు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపిక అయిన వారికి మూడు నెలలు శిక్షణ ఉంటుందని, ఏడాదికి రూ.4 లక్షలు వేతనం అందజేస్తారని కంపెనీ హ్యూమన్ రిసోర్స్ బృందం తెలిపింది. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రామారావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రవిశంకర్, అధ్యాపకులు అభినందించారు.

ఎస్పీని కలసిన క్రోసూరు ఎస్ఐ

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 8: ఇటీవల క్రోసూరు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన షేక్ మహమ్మద్ రఫీ గురువారం పల్నాడు జిల్లా ఎస్పీ వై రవి శంకర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పూల మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ విజుబుల్ పోలీసింగ్‌ను పెంచాలని ఎస్ఐకు సూచించారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌పై విద్యార్థులకు శిక్షణ

నూజెండ్ల ఫిబ్రవరి 8: మండలంలోని ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల విద్యాలయం పాఠశాలలో ఫుడ్ ప్రాసెసింగ్‌పై శిక్షణ పొందిన విద్యార్థినులను వినుకొండలోని బెంగుళూరు బేకరీ స్పైసీ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో ఆహార పదార్థాల తయారీపై పరిశీలన, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్‌వీ రమణమ్మ మాట్లాడుతూ విద్యతో పాటు ఉపాధి అవకాశాలు పెంచేందుకు పాఠశాలలో వారికి అవసరమైన వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఒకేషనల్ టీచర్ ఏ ఉషారాణి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నాదెండ్ల, ఫిబ్రవరి 8: మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెంకు చెందిన టీడీపీ కార్యకర్త జంపని శ్రీనివాసరావు అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ తరుపున రూ.10వేలు ఆర్థిక సాయాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బండారుపల్లి సత్యనారాయణ, గుర్రం నాగపూర్ణచంద్రరరావు, కొండ్రగుంట సురేష్, గుర్రం రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల తయారీపై విద్యార్థులకు అవగాహన

వినుకొండ, ఫిబ్రవరి 8: ఆహార సంరక్షణపై నైపుణ్యం కలిగి ఉండటం ప్రతిఒక్క విద్యార్థికి అవసరమని ఉప్పలపాడులోని ఏపీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.రమణమ్మ అన్నారు. పట్టణంలోని బెంగళూరు బేకరీలో కేక్ తయారీ, జాబ్, ఎగ్‌పఫ్, కర్రీపఫ్ ఇతర స్వీట్లు తయారీ, స్పైసీ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో చిల్లీచికెన్, గ్రీన్ చికెన్, తందూరి చికెన్ వంటి ఆహార పదార్థాలు ఎలా తయారు చేయాలి అనే విషయాలపై తమ పాఠశాల విద్యార్థులకు వివరించారు. ఆహార పదార్థాల తయారీలో విద్యార్థులు నైపుణ్యం తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ టీచర్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో వార్షిక తనిఖీలు

కారుమంచి (శావల్యాపురం) ఫిబ్రవరి 8: ప్రభుత్వ పాఠశాలలలోని రికార్డులన్నీ సక్రమంగా ఉండేలా హెచ్ఎంలు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా కారుమంచి బీసీకాలనీ ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో-2 పుసులూరి లలితాకుమారితో కలసి గురువారం తనిఖీ చేశారు. వర్క్‌బుక్స్‌లో సవరణలు పెండింగ్‌లో ఉండడాన్ని గమనించి సరిచూడాలని, మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వ మెనూ తప్పకుండా పాటించేలా నిరంతరం పర్యవేక్షణ చేయాలని హెచ్ఎం శిరీషకు సూచించారు. ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ బోయపాటి త్రివిక్రమ్, సీఆర్పీ ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భవిష్యత్ గ్యారెంటీ రిజిస్ట్రేషన్ పత్రాలను పంచుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి

విద్యుత్ కోతలతో జనానికి అవస్థలు

● భవిష్యత్ గ్యారెంటీలో మాజీ మంత్రి ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 8: వేసవికి ముందే వేళాపాళా లేని విద్యుత్ కోతలతో వైసీపీ ప్రభుత్వం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోందని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలు, నగరాల్లో గంటల కొద్దీ విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. సరిగ్గా వాడకం పెరిగే రోజుల్లో పగలు, రాత్రి తేడా లేకుండా ఇలా కోతలు పెడుతుంటే ప్రజల అవసరాలు ఎలా తీరతాయని ప్రశ్నించారు. మునిసిపాలిటీల్లోనూ విద్యుత్ కోతలతో కొన్ని ప్రాంతాల్లో నీటికి కూడా కటకట లాడుతున్నారని వాపోయారు. చిలకలూరిపేట మండలం గొట్టిపాడులో గురువారం బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాటి ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్-6 పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యుత్ చార్జీల వడ్డనలో ఎక్కడా రాజీపడని జగన్ సర్కార్ ప్రజలకు కావాల్సిన సమయాల్లో విద్యుత్ అందించలేక పోతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు అధికారికంగా ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన జగన్ సర్కార్ సర్‌చార్జీల రూపంలో ప్రజలపై మరింతభారం వేశారని, అదనంగా వసూలు చేస్తున్న ఆ డబ్బులన్నీ ఎక్కడికి పోతున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. రేపు ఏర్పడబోయే టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించటంతో పాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని ప్రత్తిపాటి గుర్తుచేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జువ్వాజి మదన్ మోహన్, పార్టీ నాయకులు తేళ్ళ సుబ్బారావు, జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చింది టీడీపీనే



మాజీమంత్రి ప్రత్తిపాటిని సన్మానిస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో బ్రాహ్మణ సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషిచేసింది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమేనని మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఆ వర్గంలో పేదలు, మధ్యతరగతి వారి ఉన్నతికి టీడీపీ ప్రభుత్వం ఎంతో కృషిచేస్తే జగన్ ప్రభుత్వం ప్రభుత్వం ఆ స్ఫూర్తిని నీరుగార్చిందని ఆయన ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వస్తే బ్రాహ్మణ కార్పొరేషన్‌కు వెయ్యి కోట్లు కేటాయిస్తామని జగన్ ఇచ్చిన హామీ గాలికి వదిలి వేశారని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రత్తిపాటి నివాసంలో ఆయనను గురువారం ఆదిత్య బ్రాహ్మణ సేవా సంఘం చిలకలూరిపేట శాఖ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించి వేదాశీర్వచనం అందించారు. అనంతరం మాట్లాడుతూ వేదపండితులకు, పురోహితులకు ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వటంలేదని వాపోయారు. అందుకే గత టీడీపీ హయాంలో జరిగిన మేలు గుర్తు తెచ్చుకొని మళ్ళీ ఆ రోజుల కోసం 2024 ఎన్నికల్లో బ్రాహ్మణ సంక్షేమ సంఘం తరుపున టీడీపీ విజయానికి, చిలకలూరిపేటలో ప్రత్తిపాటి విజయానికి కృషి చేస్తామని వారు వెల్లడించారు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థికసాయం

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 8: మండలంలోని మురికిపూడి గ్రామానికి చెందిన గుంజి వీరాంజనేయులు ఇటీవల మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వీరాంజనేయులు మృతికి సంతాపం తెలియజేసి ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా వారి కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయాన్ని పార్టీ నాయకుల ద్వారా అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జువ్వాజి మదన్‌మోహన్, గంజి శ్రీనివాసరావు, చెన్నుపాటి నాగరాజు, చిగురుపాటి రాజు, తిరుపతయ్య శ్రీహరి, శివ, ఆదినారాయణ, మల్లికార్జున పాల్గొన్నారు.

కొండవీడు యూపీ పాఠశాలలో హిందీ పరీక్షా కేంద్రం

కొండవీడు (యడ్లపాడు), ఫిబ్రవరి 8: మండలంలోని కొండవీడు ప్రాథమికోన్నత పాఠశాలను దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్ష కేంద్రంగా ఎంపికచేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోరంట్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 11న హిందీ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, 5నుంచి 8వ తరగతి చదువుతున్న 92మంది విద్యార్థులు ప్రాథమిక, పరిచయ పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు.

రజకులను ఎస్సీలలో చేర్చాలి: నేషనల్ ధోబీ మహాసంఘ్

యడ్లపాడు, ఫిబ్రవరి 8: రజకులను ఎస్సీలలో చేర్చాలని నేషనల్ ధోబీ మహాసంఘ్ జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. రజకుల ఎస్సీ వర్గీకరణ సాధన లక్ష్యంగా తిరుపతి నుంచి విజవాడ ఇంద్రకీలాద్రి వరకు నేషనల్ ధోబీ మహాసంఘ్ నాయకులు చేపట్టిన పాదయాత్ర గురువారం యడ్లపాడుకు చేరుకుంది. గ్రామానికి చేరుకున్న పాదయాత్ర బృందానికి స్థానిక రజక సంఘం పెద్దలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా రజకులు ఆర్థిక, సామాజిక, విద్యా విషయాలలో ఎంతో వెనుకబడి ఉన్నారన్నారు. అంతేగాకుండా రాజకీయంగానూ ఎదగలేకపోయారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రజకులను ఎస్సీలలో చేర్చి సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శివప్రసాద్, యల్లమంద పుల్లయ్య, పేరిబాబు, కృష్ణ, చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, తోరాటి పోతురాజు, సీతారామయ్య తదితరులు ఉన్నారు.